


# విజయభాను




విశాఖపట్నం, బుధవారం 01-11-2017 | VIJAYABHANU DAILY VISAKHAPATNAM EDITION | సంపుటి : 41 సంచిక : 48 పేజీలు : 8 వెల : 1 రూపాయి

# పటేల్ వారసత్వాన్ని విస్మరించారు



- గుజరాత్‌లో ఐక్యతా పరుగు
- ప్రారంభించిన ప్రధాని మోదీ

న్యూఢిల్లీ: సర్దార్ వల్లభాయ్ పటేల్‌ను కాంగ్రెస్ పార్టీ దారుణంగా విస్మరించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. దేశానికి తొలి ఉపప్రధానిగా పనిచేసిన పటేల్ సేవలను కూడా తుడిచివేసేందుకు కాంగ్రెస్ యత్నిస్తోందన్నారు. పటేల్ జయంతి సందర్భంగా గుజరాత్‌లో ఆయన మంగళవారం ఉదయం ఐక్యతా పరుగును ప్రారంభించారు. ధ్యాన్‌చంద్ స్టేడియంలో ఈ కార్యక్రమానికి తరలివచ్చిన వారిని ఉద్దేశించి మోదీ ప్రసంగించారు. పటేల్ వారసత్వాన్ని గత ప్రభుత్వాలు తీవ్రంగా నిర్లక్ష్యం చేశాయి. దేశంలోని నూతన తరానికి సర్దార్ పటేల్ పాత్రను కనీసం పరిచయం చేయలేదు. చరిత్రలో వారి సేవలను తుడిచిపెట్టేందుకు లేదా ప్రాధాన్యతలను తగ్గించే యత్నంలో భాగంగానే ఇలా నిర్లక్ష్యం చేశారు. ఓ రాజకీయ పార్టీ పటేల్‌ను పితామహుడిగా భావించినా, భావించకపోయినా... దేశ తరువాయి 2లో

### దేశ ఐక్యత, చిత్తశుద్ధికి మారుపేరు

# సర్దార్ వల్లభాయ్‌పటేల్

### ఎంపి హరిబాబు



విశాఖపట్నం : సర్దార్ వల్లభాయ్‌పటేల్ పేరువేనగానే ఉక్కు మనిషి, దేశాన్ని సమైఖ్యంగా ఉంచడం, సంస్థానాదీశులను ఒప్పించి దేశాన్ని సమఖ్యంగా ఉంచడం గుర్తుకువస్తుందని విశాఖపార్లమెంట్ సభ్యులు కంబంపాటి హరిబాబు అన్నారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా మంగళవారం ఉదయం సర్క్యూట్ హౌస్ జంక్షన్ వద్దగల ఆయన విగ్రహానికి పూలదండలువేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ ఐక్యత, చిత్తశుద్ధి, దేశభద్రత, సంరక్షణకు విశేష కృషిచేసారన్నారు. వందల కొలది సంస్థానాలను ఉక్కు సంకల్పంతో దేశంలో తరువాయి 2లో



# పోలీస్ రాజ్యంగా మారిన చంద్రబాబు పాలన

### వైయస్సార్ సీపీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ లక్ష్మీ పార్వతి ధ్వజం

విశాఖ సిటీ : రాష్ట్రంలో చంద్రబాబు పరిపాలన అరాచకంగా మారిందని, మహిళలకు ఎటువంటి రక్షణ లేకుండా పోయిందని మానవ, ప్రజా స్వామ్య హక్కుల పై దాడులు, నిర్బంధ పోలీస్ చర్యలు ఎక్కువైందని వైయస్సార్ సీ పీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ నందమూరి లక్ష్మి పార్వతి తీవ్రంగా ఆరోపించారు. మంగళవారం ఉదయం మహిళల పై జరుగుతున్న అత్యాచారాలకు వ్యతిరేకంగా నగర వైస్సార్ సీ పీ మహిళా విభాగం అద్యక్షురాలు గరికిన గౌరి ఆధ్వర్యంలో జరిగిన నిరశన ,ఆందోళన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. మొదట జీవీఎంసీ గాంధీ విగ్రహం కు ఆమె పూల మాలలు వేసి నివాళులర్పించారు.అనంతరం ఆమె మీడియాతో మాట్లాడుతూ ప్రజా నిరశనలు, ఉద్యమాలు , పోరాటాల పై చంద్రబాబు ప్రభుత్వం తీవ్ర నిర్బంధం ప్రయోగిస్తుందని విమర్శించారు. పోలీస్ తరువాయి 2లో




### అమరావతి రైతులకు సింగపూర్‌లో స్వాగతం

- 4 రోజులపాటు పర్యటన
- అక్కడి అభివృద్ధి అంశాలపై పరిశీలన

సింగపూర్ : ఏపీ రాజధాని నుంచి సింగపూర్ చేరుకున్న అమరావతి రైతులకు అక్కడ అపూర్వ స్వాగతం లభించింది. సింగపూర్ తెదేపా ఫోరం ప్రతినిధులు జైరాం, చెన్నపాటి భానుచంద్ ఆధ్వర్యంలో సింగపూర్ విమానాశ్రయంలో పుష్పగుచ్ఛాలు ఇచ్చి రైతులను ఆహ్వానించారు. సోమవారం 34 మంది రైతుల తరువాయి 2లో

### రేవంత్

# కాంగ్రెస్‌లో చేరిక

- రాహుల్ సమక్షంలో పార్టీ తీర్థం
- రేవంత్‌తోపాటు ఆయన అభిమానులూ..



దిల్లీ : తెదేపాను వీడిన రేవంత్‌రెడ్డి కాంగ్రెస్ పార్టీలో చేరారు. కాంగ్రెస్ ఉపాధ్యక్షుడు రాహుల్‌గాంధీ సమక్షంలో రేవంత్ ఆ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అంతకుముందు దిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం నుంచి రేవంత్‌ను రాహుల్ గాంధీ నివాసానికి టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇంఛార్జ్ కుంతియా తీసుకొచ్చారు. అనంతరం రేవంత్‌ను పార్టీలోకి రాహుల్‌గాంధీ సాదరంగా రేవంత్‌తోపాటు ములుగు తరువాయి 2లో

### ఆర్టీసీకి వెయ్యి కొత్త బస్సులు!

అమరావతి : ఆర్టీసీ బస్సులు వరుస రోడ్డు ప్రమాదాలకు గురవుతున్న నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం అప్రమత్తమైంది. ప్రమాదాలను తగ్గించడం కోసం డ్రైవర్లకు శిక్షణ తరగతులు నిర్వహించాలని రవాణా శాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు ఆర్టీసీ యాజమాన్యానికి సూచించారు. ఏడాదికోసారి తరువాయి 2లో

### జయలలిత మేనకోడలు అదృశ్యం..!

చెన్నై: తమిళనాడు దివంగత మాజీ ముఖ్యమంత్రి జయలలిత మేనకోడలు దీపా జయకుమార్ కన్పించడంలేదట. కొద్దిరోజుల నుంచి దీపకు ఆమె భర్త మాధవన్‌కు మధ్య విభేదాలు తరువాయి 2లో




### టేకిట్ ఈజీ



మీతో తర్వాత ...
ముందు మీ కుక్కని
ఇంటర్వ్యూ చేస్తాం సార్ !

### నేడు స్టీల్ ప్లాంట్‌లో పర్యటించనున్న

# కేంద్ర ఉక్కు శాఖా మంత్రి

గాజువాక: కేంద్ర ఉక్కు శాఖామంత్రి చౌదరిబీరేందర్‌సింగ్ బుధవారం విశాఖ స్టీల్ ప్లాంట్ పర్యటించనున్నారు. ఉక్కు అదనపు కార్యదర్శి, ఫైనాన్సియల్ అడ్వైజర్ సరస్వతి ప్రసాద్, సంయుక్తకార్యదర్శి రుచిక చౌదరి గోవిల్, ఉక్కు మంత్రిత్వ శాఖా డైరెక్టర్ నీరజ్ అగర్వాల్‌లతో కలిసి కేంద్రమంత్రి చౌదరిబీ రేందర్ సింగ్ ఉక్కునగరంలో ఏర్పాటు చేసిన పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉక్కునగరం మల్టీపర్పస్ హాల్ లో బ్యాడ్మింటన్ కోచింగ్ క్యాంపును కేంద్రమంత్రి ప్రారంభిస్తారు.

విశాఖ స్టీల్‌ప్లాంట్ బ్రాండ్ అంబాసిడర్ పి.వి.సింధు అభినందన కార్యక్రమంలో ఉక్కు సి.యం.డి మధుసూధన్ తో కలిసి పాల్గొం



టారు. విశాఖ ఉక్కు సి.యం.డి మధుసూదన్ నేతృత్వంలో జరిగే స్టీల్ ప్లాంట్ రివ్యూ, ఉక్కు ప్రగతిపై జరిగే చర్యలో పాల్గొంటారు. అనంతరం స్టీల్ ప్లాంట్ లోని ధర్మల్ పవర్ ప్లాంట్ విభాగ తరువాయి 2లో

# వాగ్దానాలు అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం

## - సిపిఐ జిల్లా కార్యదర్శి మధు




ఆలమూరు : ఎన్నికల వాగ్ధానాలు అమలు చేయడంలో కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సిపిఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. కొత్తపేట, మండపేట నియోజకవర్గాల సిపిఐ మండల శాఖ సమావేశం ఆలమూరులో మంగళవారం సీనియర్ కమ్యూనిస్ట్ నాయకులు బండారు లక్ష్మణస్వామి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న మధు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి, రాష్ట్రంలో టిడిపి ప్రభుత్వాలు కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని ఆయన విమర్శించారు. కేంద్రం తీసుకున్న నోట్లు రద్దు, జి.ఎస్.టి. అమలు వల్ల ప్రజలకు ఏ ప్రయోజనం చేకూరలేదు కానీ అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వీటన్నిటిపై సిపిఐ మిత్ర వామపక్షాలతో కలసి ప్రజల పక్షాన పోరాడుతుందని ఆయన అన్నారు. పార్టీని బలోపేతం చేయడానికి ఈ సమావేశంలో సిపిఐ మండల మహాసభల ఏర్పాట్లుపై కార్యాచరణ రూపొందించారు. ఈ సమావేశంలో ఎ.ఐ.టి.యు.సి. జిల్లా నాయకులు తోకల ప్రసాద్, ఆలమూరు మండల శాఖ కార్యదర్శి కె.రామకృష్ణ, రావుల పాలెం మండల కార్యదర్శి కర్రి రామిరెడ్డి, కపిలేశ్వరపురం మండల కార్యదర్శి చిట్టూరి ప్రసాద్, మండపేట నుండి బండారు లక్ష్మణస్వామి, ప్రజానాట్య మండలి జిల్లా బాధ్యులు వి. శ్యామ్, ఎ.ఐ.వై.ఎఫ్ నుండి జి.ఆనంద్, వ్యవసాయ కార్మిక సంఘ నాయకులు సూరంపూడి వెంకట్రావు, పలువురు పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

# మంత్రి వెడలిన కొద్దిసేపటికే వైయస్సార్‌సిపిలో చేరికలు



ఆలమూరు : మండల పరిధిలోని మూలస్థాన అగ్రహారం గ్రామంలో నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి బండారు సత్యానందరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఇంటింటికీ తేదాపా కార్యక్రమంలో రాష్ట్ర భూగర్భ గనుల శాఖామంత్రి ఆర్.వి. సుజయ కృష్ణ రంగారావు, పార్టీకి సంబంధించిన అతిరథ మహారథులు పాల్గొని వెడలిన కొద్ది గంటలలో ఆ గ్రామానికి సంబంధించి 400 మంది టిడిపి కార్యకర్తలు వైయస్సార్‌సిపిలో చేరారు. కొత్తపేట ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి సమక్షంలో గ్రామంలోని ఎస్.సి.పేటలోని కొంతమంది మహిళలు, అలాగే గానుగుల వారి వీధి, శివాలయం ప్రాంతానికి చెందినవారు వైయస్సార్‌సిపిలో చేరారు. ఈ సందర్భంగా మండల పార్టీ కన్వీనర్ తమ్మన శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్యే జగ్గిరెడ్డి మాట్లాడుతూ వైయస్సార్ పార్టీ తరపున గెలుపొందిన మంత్రి సుజయ కృష్ణ రంగారావు టిడిపిలో చేరి విశ్వసనీయతకు, విలువలకు తిలోదకాలు ఇచ్చారన్నారన్నారు. గ్రామ ప్రజల చిరకాల వాంఛ అయిన వంతెన నిర్మాణాన్ని అధికారులతో పోరాడి పనులు పూర్తిచేస్తే టిడిపి నేతలు తమ ఘనతగా చాటుకోవడం సిగ్గుచేటన్నారు. ప్రజా సమస్యలు తెలుసుకునేందుకు పాదయాత్ర చేస్తున్న పార్టీ అధినేత జగన్మోహన రెడ్డిని ఆశీర్వదించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో వైయస్సార్‌సిపి రాష్ట్ర కార్యదర్శి కర్రి నాగిరెడ్డి, రావులపాలెం ఎంపిపి కోట చెల్లయ్య, జెడ్.పి. ప్రతిపక్ష నాయకుడు సాకా ప్రసన్నకుమార్, నైనాల శ్రీరామచంద్రమూర్తి, పామర్తి శ్రీనివాసు, జోళ్ళ అర్జునుడు, రేలంగి సత్యనారాయణ, ఆనెం వెంకన్న, దాకారపు సత్యం, మూరా రాముడు, తోట సతీష్, మోటిపల్లి వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# రామంచంద్రపురం ఎస్సైని వెంటనే డిస్మిస్ చేయాలి

## వైసిపి యువజన విభాగం ఆధ్వర్యంలో ఆందోళన



పిఠాపురం : రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం హాయంలో మానవహక్కులకు తీవ్రంగ భంగం వాటిల్లుతుందని వైసిపి రాష్ట్ర యువజన ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి దొరబాబు ఆవేదన వ్యక్తం చేశారు. పిఠాపురం పట్టణంలో వైసిపి రాష్ట్ర యువజన అధ్యక్షుడు జక్కంపూడి రాజాపై రామచంద్రపురం ఎస్సై నాగరాజు దాడిని నిరసిస్తూ ర్యాలీ నిర్వహించారు. పట్టణ యువజన అధ్యక్షుడు ముమ్మిడి శ్రీను ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో తొలుత ఉప్పాడ సెంటర్‌లోని గాంధీ విగ్రహానికి మాదిరెడ్డి పూలమాల వేసి వినతి పత్రం అందజేశారు. వైసిపి కార్యకర్తలు పోలీసుల జులుం నశించాలని ఎస్సైని తక్షణమే విధులనుంచి తొలగించాలని నినాదాలు చేశారు. ఈ సంధర్భంగా ప్రధాన కార్యదర్శి మాదిరెడ్డి దొరబాబు మాట్లాడుతూ తక్షణం ఎస్సై నాగరాజును డిస్మిస్ చేయాలని డిమాండ్ చేశారు. ప్రతిపక్ష పార్టీకి రాష్ట్ర యువజన అధ్యక్షుడైన రాజాపై ఎస్సై నిరంకుశ వైఖరిని, దాడిని తీవ్రంగా దుయ్యబట్టారు. అనంతరం కార్యకర్తలు వైసిపి జెండాలు చేతబట్టి రాష్ట్రంలో పోలీసుల పాలన సాగుతుందని, పౌరులకు రక్షణలేదని నినాదాలు చేసుకుంటూ ఆర్.ఆర్.బి. హెచ్.ఆర్ కళాశాల మీదుగా రథాలపేట సెంటర్ వద్దకు చేరి అంబేద్కర్ విగ్రహానికి వినతి పత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి చింతపల్లి మధుసుదనరెడ్డి, కొత్తపల్లి మండల వైసిపి యువజన అధ్యక్షుడు మారిశెట్టి సత్తిబాబు, పిఠాపురం మండల యువజన అధ్యక్షుడు కొత్తపల్లి రమణబాజ్జీ, గొల్లప్రోలు పట్టణ యువజన అధ్యక్షుడు కుర్రే శంఖర్, పిఠాపురం యువజన కార్యదర్శి వజ్రపు వీరేష్ పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఆన్‌లైన్లో ట్యాబ్‌ల ద్వారా సమాచారాన్ని పొందు పరచాలి

అచ్యుతాపురం: ఎఎన్ఎమ్‌లు ఎప్పటి సమాచారాన్ని అప్పుడే ఆన్‌లైన్లో పొందు పరచాలని ప్రాదమిక ఆరోగ్య కేంద్రం సామాజిక ఆరోగ్యాదికారి పి.సాంబమూర్తి అన్నారు. మంగళవారం పూడిమడక, మడుతూరు సబ్ సెంటర్లను సందర్శించి ఎఎన్ఎమ్‌ల పని తీరును, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం రైట్ టైమ్ ఇన్‌ఫర్మేషన్ నడుస్తుందని ఎఎన్ఎమ్‌లు ఎప్పటికప్పుడు సమాచారాన్ని తమ కిచ్చిన ట్యాబ్‌ల ద్వారా ఆన్‌లైన్లో పొందు పరచాలన్నారు. అలాగే తమకు కేటాయించిన గ్రామలలో అన్ని జాతీయ కార్యక్రమాలను అమలు పరచాలన్నారు. సీజనల్ వ్యాదుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వ్యాది గ్రస్తులను వైద్యాదికారి దగ్గరికి పంపించాలన్నారు. ఈ కార్యమ్రంలో పిహెచ్‌సి సిబ్బంది లండా అప్పలకొండ తదితరులు ఉన్నారు.

# నిర్వాసితులకు, స్థానికులకు ఉపాది కల్పించాలి



అచ్యుతాపురం: నిర్వాసితులకు, స్థానికులకు ఉపాది కల్పించాలని, రేషన్ డిపోలను రిలయన్స్, హెరిటేజ్ సంస్థలకు అప్పగించొద్దని సిపిఎమ్ డివిజన్ కన్వీనర్ రొంగలి రాము అన్నారు. మంగళవారం స్థానిక సిపిఎమ్ కార్యాలయంలో కామ్రెడ్ బుద్దా రంగారావు అద్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సెజ్ వస్తే నిర్వాసితులకు 65 వేలుద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చి నేటికి 10 సంవత్సరాలు కావస్తున్నా నిర్వాసితులకు ఉపాది గురించి ప్రభుత్వం పట్టించుకోవట్లేదన్నారు. నిర్వాసితులకు, స్థానికులకు వెంటనే ఉపాది కల్పించాలని ఆయన డిమాండ్ చేసారు. రేషన్ డిపోలలో బియ్యం కూడా ఇవ్వకుండా నగదు ఇస్తామని రిలయన్స్ లాంటి సంస్థలకు అప్పగించి పేదల కడుపు కొట్టే ప్రయత్నం చేస్తుందన్నారు. విలేజ్ మాల్స్‌గా కాకుండా రేషన్ షాపులను కొనసాగించాలని, బియ్యానికి బదులు నగదు బదిలీ వద్దని ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో సిపిఎమ్ మండల కార్యదర్శి కూండ్రపు సోమునాయుడు, కాసులమ్మ, నారాయణ, లక్ష్మి ఉన్నారు.

# 5న శంకరమఠంలో వేదసభ

విశాఖపట్నం : ముష్టి పురుషోత్తమావధాని వేదశాస్త్ర ట్రస్ట్ 13వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని ద్వారకా నగర్ దరి, శంకరమఠంలో నవంబర్ 5వ తేదీన సాయంత్రం 6 గంటల నుండి 8 గంటల వరకు లోక కళ్యాణార్థం విశ్వశాంతిని ఆకాంక్షిస్తూ వేదసభ కార్యక్రమాన్ని నిర్వహించుచున్నామని ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త ఎం.వి.రాజశేఖర్ పత్రికా ప్రకటనలో తెలియజేస్తున్నారు. సంస్థ కార్యదర్శి ముష్టి వెంకటేశ్వర ఘనపాఠి సారధ్యంలో వేదశాస్త్ర ట్రస్ట్ ప్రతినిధులు సమక్షంలో వేదసభ జరుగుతుంది. ఈ వేదసభ కార్యక్రమానికి ఆంధ్రరాష్ట్రంలో ప్రముఖ వేదపండితులుగా పేరుగాంచిన డా॥ చిర్రావూరి శ్రీరామశర్మ, గుళ్ళపల్లి సీతారామచంద్ర ఘనపాఠి, డా॥విశ్వనాథ గోపాలక్రిష్ణ శాస్త్రి, వేదుల సుబ్రమణ్య శాస్త్రి, జి.అక్కుభట్ల శర్మ, దువ్వూరి సర్వేశ్వర ఘనపాఠి తదితరులు అతిధులుగా పాల్గొంటున్నారు. కావున నవంబర్ 5న నిర్వహించే వేదసభ కార్యక్రమంలో విశాఖ వాసులందరు పాల్గొని వేదమాత గాయత్రీదేవి ఆశీస్సులు పొందమని కోరుతున్నారు.

# వీరనారాయణం వద్ద 65 లక్షలతో తారురోడ్డు నిర్మాణం



మాడుగుల : మండలంలోని జంపెన శివాలయం నుండి వీరనారాయణం గ్రామం వరకు తారురోడ్డు నిర్మిస్తున్నారు. ఇక్కడ మట్టి రోడ్డు గతులు మయంగా ఉండి రాకపోకలకు పలు గ్రామాలు ప్రజలు తీవ్ర ఇబ్బంది పడేవారు. 800మీటర్లు పోడుగున ఉన్న ఈ మట్టి రోడ్డుకు 65 లక్షల రూపాయిల పంచాయితీరాజ్ నిధులతో రక్షణగోడ, తారురోడ్డు నిర్మాణాన్ని గత రెండు రోజులుగా చేపట్టారు. జంపెన -వీరనారాయణం గ్రామాల ఈ లింక్‌రోడ్డు నిర్మాణం పూర్తి అయితే తమకు మార్గం సుగమం అవుతుందని వీరనారాయణ గ్రామస్తుల కాళ్ళ బాలకృష్ణ , వసంత రాజబాబు తదితరులు తెలిపారు.

# పరులకు సహాయం చేయుటలో మానవత్వం ఉంది

## పీఠాధిపతి డా॥ ఉమర్ ఆలీషా

పిఠాపురం : సాటి మానవులకు సహాయపడటంలో మానవత్వం ఉందని శ్రీ విశ్వవిజ్ఞాన విద్య ఆధ్యాత్మిక పీఠం నవమ పీఠాధిపతి డా॥ ఉమర్ ఆలీషా భక్తులకు హితవు పలికారు. కార్తీకమాస పర్యటనలో భాగంగా పిఠాపురం మండల విరవాడ గ్రామంలో స్థానిక ఆశ్రమ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన జ్ఞాన చైతన్య సదస్సుకు గురువర్యులు డా॥ ఉమర్ ఆలీషా అధ్యక్షత వహించి ప్రసంగించారు. కార్తీకమాస పుణ్యకాలంలో దీపము, ధూపము, నైవేధ్యంతో పాటు భగవంతుడు ప్రసాదించిన సంపదలో కొంతభాగం దాన ధర్మలకు వినియోగించి పరులకు సహాయ పడాలన్నారు. దాన ధర్మాల ద్వారా శాంతి, సుఖము, సంతోషము లభించి మానవుడు జన్మసార్ధకత తెలుసుకుని ముక్తి మార్గంలో ప్రయాణం చేస్తాడని పీఠాధిపతి తెలిపారు. ఈ కార్యక్రమంలో యండమూరి శ్రీనివాసు స్వామిని శాలువాతో సత్కరించారు. సర్పంచ్ బోయిన నాగేశ్వరరావు, ఉపసర్పంచ్ అడపా రామస్వామి, ఎంపిటిసీ జవ్వాది బాబ్జీ గురువర్యులను దర్శించి తరించారు.

## మొదటి పేజీ తరువాయి

### ఆర్టీసీకి వెయ్యి కొత్త బస్సులు!

బస్సులకు ఫిట్‌నెస్ తనిఖీలు చేపట్టాలని ఆయ రవాణా శాఖ అధికారులను ఆదేశించారు. డొక్కుగా మారిన పాత బస్సుల స్థానంలో కొత్త బస్సుల కొనుగోలుకు రాష్ట్ర ప్రభుత్వం అంగీకరించింది.

ప్రస్తుతం ఏపీఎస్‌ఆర్టీసీలో 5 శాతం బస్సులు పదేళ్లకు పైగా సేవలు అందిస్తుండగా.. పది శాతం బస్సులు 12 లక్షల కి.మీ.కు పైగా ప్రయాణించాయి. దీంతో అవి ఎప్పుడు ఆగిపోతాయో తెలియని పరిస్థితి నెలకొంది. ఇటీవలే విజయవాడ, విశాఖ, అనకాపల్లిల్లో ఆర్టీసీ బస్సుల ప్రమాదం కారణంగా పలువురు ప్రాణాలు కోల్పోయారు. దీంతో పాత బస్సుల స్థానంలో ఈ ఏడాది వెయ్యి బస్సులు కొనుగోలు చేసేందుకు ప్రభుత్వం అనుమతిచ్చింది.

### జయలలిత మేనకోడలు అదృశ్యం..!

ఏర్పడటంతో ఇద్దరి మధ్య పరస్పరం గొడవలు చోటుచేసుకున్నాయి. ఈనేపథ్యంలో దీప శుక్రవారం ఇంటి నుంచి వెళ్లిపోయిందట.

గతవారం మాధవన్ తనను దీప డ్రైవర్ రాజా చంపుతానని బెదిరిస్తున్నట్లు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. పోలీసులు దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఈ సందర్భంగా దీప స్వయంగా పోలీస్ స్టేషన్‌కు వెళ్లి తన భర్త ఇచ్చిన ఫిర్యాదులో వాస్తవంలేదని వెల్లడించింది. ఈ ఘటన తర్వాత ఆమె ఇంట్లో నుంచి వెళ్లిపోయినట్లు సమాచారం.

నాటి నుంచి దీప ఆచూకీ తెలియడంలేదట. ఆర్కే నగర్ ఉప ఎన్నికలు దగ్గరపడుతున్న నేపథ్యంలో దీప అదృశ్యం పలు అనుమానాలను రేకెత్తిస్తోంది. ఆమె అనుచరులు కంగారుపడుతున్నారు. ఉప ఎన్నికల్లో దీప ఆర్కేనగర్ నుంచి పోటీ చేస్తానని అంటోంది. మరోపక్క శశికళ మేనల్లుడు దినకరన్ కూడా అక్కడి నుంచే పోటీ చేస్తానని ప్రకటించారు.

### పటేల్ వారసత్వాన్ని విస్మరించారు

యువత ఆయనను మరిచిపోయేలా మాత్రం చేయకూడదు. సర్ధార్ పటేల్‌ను విస్మరించే ప్రయత్నాలపై భారత తొలి రాష్ట్రపతి రాజేంద్ర ప్రసాద్ సైతం విచారం వ్యక్తం చేశారు.. అని ప్రధాని మోదీ పేర్కొన్నారు.

స్వాతంత్ర్య పోరాటంలోనూ, స్వాతంత్ర్యం అనంతరం పటేల్ దేశానికి చేసిన సేవలపై గర్విస్తున్నాం... ప్రతి సర్దార్ పటేల్ జయంతి రోజున తప్పకుండా ఆయనను గుర్తుచేసుకుంటాం అని యువకులతో ప్రమాణం చేయించారు. కాగా ప్రధాని మోదీతో పాటు ఈ కార్యక్రమానికి కేంద్ర హోమంత్రి రాజ్‌నాథ్ సింగ్, క్రికెటర్ సురేశ్ రైనా, వెయిట్ లిఫ్టర్ కరణం మల్లీశ్వరీ, జిమ్నాస్ట్ దీపాకర్మాకర్, హాకీ క్రీడాకారుడు సర్దారా సింగ్ సహా పలువురు క్రీడాకారులు పాల్గొన్నారు. కాగా పటేల్ జయంతి సందర్భంగా ఇవాళ దేశమంతటా జాతీయ ఐక్యతా దినోత్సవం జరుపుకుంటున్న సంగతి తెలిసిందే.

### రేవంత్ కాంగ్రెస్‌లో చేరిక

మాజీ ఎమ్మెల్యే సీతక్క, వేంనరేందర్‌రెడ్డి, విజయరమణారావు, అరికెల, బోడ జనార్దన్, మేడిపల్లి సత్యం తదితరులు కూడా కాంగ్రెస్‌లో చేరారు.

మరికాసేపట్లో రేవంత్ చేరికను మీడియా సమావేశం ఏర్పాటు చేసి ఏఐసీసీ అధికారికంగా ప్రకటించనుంది. కాంగ్రెస్‌లో రేవంత్‌కు ఏ బాధ్యతలు అప్పగిస్తారో తెలియాల్సి ఉంది. ఇటీవల తెదేపాకు, ఆ పార్టీ పదవులకు, శాససభ సభ్యత్వానికి రేవంత్ రాజీనామా చేసిన విషయం తెలిసిందే.

### నేడు స్టీల్ ప్లాంట్‌లో పర్యటించనున్న కేంద్ర ఉక్కు శాఖా మంత్రి

ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన టర్బో బ్లోయర్-5ను కేంద్రమంత్రి ప్రారంభిస్తారు.సాయంత్రం 4గం.లకు సుమారు. 2.25లక్షల టన్నుల ఉక్కు ఉత్పత్తులను విశాఖపట్నం పోర్టుట్రస్టు నుంచి అహ్మదాబాద్, కాచి, ముంబైలకు ఎగుమతి చేయడానికి ఉద్దేశించిన ప్రొజెక్ట్‌ను జెండా ఊపి ప్రారంభించనున్నారు.

### పోలీస్ రాజ్యంగా మారిన చంద్రబాబు పాలన

లను ఉపయోగించి అక్రమ కేసులను పెట్టిస్తున్నారని ఆరోపించారు.

ఈ నిర్బంధ చర్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు పరిపాలన లో రౌడీయిజం, గుండా యిజం, భూకబ్జాలు, హత్యలు, మానభంగాలు పెరిగిపోయావని అన్నారు.పట్ట పగలే మహిళల పై నడి రోడ్డు పై అత్యాచారాలు జరిగిపోతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. రాష్ట్రం లో లా అండ్ ఆర్డర్ పూర్తిగా గాడి తప్పిందని పేర్కొన్నారు. పోలీస్ లు అధికార పార్టీ నాయకులకు కొమ్ము కాస్తున్నారని ఆరోపించారు. ప్రశాంత నగరంగా ఉన్న విశాఖ సంఘ విద్రోహులకు నిలయంగా మారిపోయిందని చెప్పారు. ఎంతో సాంస్కృతి ,సాంప్రదాయాలు ఉన్న విశాఖలో భూకబ్జాలు హత్యా రాజకీయాలు , మహిళల పై దాడులు,అత్యాచారాలకు విశాఖ నిలయంగా మారిందని పేర్కొన్నారు. దీనికి చంద్రబాబు నాయుడు నైతిక బాధ్యత వహించాలన్నారు.పబ్లిక్ గా విశాఖలో మహిళ పై రేప్ జరిగిన పోలీస్ లు నిరోధించలేకపోయారని, ప్రజలు కూడా స్పందిచలేక పోయారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు.పోలీస్ వ్యవస్థ పూర్తిగా అధికార పార్టీకి తొత్తుగా మారిపాయింది, చివరకు కాకర్ల పద్మ లత కు విషమిచ్చి చంపి ఒక పోలీస్ అధికారి గుండాలా ప్రవర్తిస్తూ , హత్యలకు పాల్పడటం దారుణం అన్నారు. టి డి పి పార్టీ ని ఎన్టీఆర్ ఎంతో ఉన్నత ఆశయాలతో స్థాపించారని చంద్ర బాబు ఈ పార్టీ ని హైజాక్ చేసి తన తరహా అరాచక పరిపాలనకు తెర లేపారన్నారు.ఇటువంటి పరిపాలన చూసి ఎన్టీఆర్ ఆత్మ ఘోషిస్తుందని ఆమె అన్నారు.అధికారం ,డబ్బు సంపాదన తప్ప చంద్రబాబు కు మరో అజెండా లేదని ఎద్దేవా చేశారు.జిల్లా మంత్రి గంటా శ్రీనివాసరావు మేకప్ లేకుండా బయటకీ రాడని, ఆయనకు సామాన్యుల గోడు పట్టదని , నీచమయిన విదేశీ విష సంస్కృతిని పర్యాటక రంగం పేరున విశాఖలో ఫాషన్ షోలు,బికినీ డాన్సులు ప్రోత్సహహించడం ఎంత వరకు న్యాయమన్నారు.అందాల పోటీలను నిరశించినందుకు మహిళా సంఘాల నాయకులు పై తీవ్ర దాడి చేసి క్రిమినల్ కేసులు బనాయించారని ,రక్షణ కల్పించవలసిన పోలీసులే దుష్ట శక్తులుగా మారారని అన్నారు.ఎన్టీఆర్ అమలు చేసిన మద్య నిషేధాన్ని చంద్రబాబు రద్దు చేసి, వీధి వీధికి వైన్ షాపులను, బెల్ట్ షాపులను ఏర్పాటు చేసి పేయాజలు జీవితాలతో ఆడుకుంటున్నారని ధ్వజమెత్తారు. టి డి పి హాయాంలో విశాఖలో లక్ష ఎకరాల భూకబ్జాలు జరిగాయని మొక్కుబడిగా సిట్ ఏర్పాటు చేశారని ఆమె విమర్శించారు. ఎమ్మెల్యే,ఎంపీలు, మంత్రులకు, నాయకులకు సంబంధాలు ఉన్న వారి పై చర్యలు తీదుకునే దమ్ము లేదని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర నాథ్, మహిళా నగర అధ్యక్షులు గరికిన గౌరీ,

మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీలా వెంకట లక్ష్మీ, శ్రీదేవి వర్మ , మహిళా నాయుకులు శశి కళ ', మధులత, సబీర, రోజారాణీ పార్టీ నాయకులు సత్తి రామ కృష్ణా రెడ్డి, రామన్న పాత్రుడు, పీతల మూర్తి యాదవ్,బత్తిన నాగరాజు, స్వర్ణ, తదితరులు పాల్గొన్నారు.

### అమరావతి రైతులకు సింగపూర్‌లో స్వాగతం

తప్పకుండా తొలిబృందం సీఆర్డీఏ అధికారులతో కలిసి సింగపూర్ వెళ్లింది. ఈ బృందానికి ముఖ్యమంత్రి చంద్రబాబు వెలగపూడి సచివాలయంలో శుభాకాంక్షలు తెలిపి వీరి పర్యటనను లాంఛనంగా ప్రారంభించారు. నాలుగు రోజులపాటు సింగపూర్‌లో వివిధ ప్రాంతాల్లో రైతులు పర్యటిస్తారు. 40 ఏళ్లలో సింగపూర్ అభివృద్ధి ఎలా సాధించిందనే అంశంపై అధ్యయనం చేసి అక్కడి పరిస్థితులపై అవగాహన కల్పించుకుంటారు.

అభివృద్ధి దశలో అక్కడి ప్రజలకు ఎలాంటి అవకాశాలు వచ్చాయి? వాటిని ఎలా వినియోగించుకుని అభివృద్ధి చెందారనే అంశాలను ఈ పర్యటనలో రైతులు పరిశీలిస్తారు. సీఆర్డీఏ అదనపు కమిషనర్ చెన్నకేశవరావు తదితరులు రైతులతో ఉన్నారు.

### దేశ ఐక్యత, చిత్తశుద్ధికి మారు పేరు సర్దార్ వల్లభాయ్‌పటేల్

విలీనంచేసిన ఘనత పటేల్‌దే అన్నారు. అవినీతి, దారిద్ర్యం, ఉగ్రవాదంలేని నవభారత నిర్మాణానికి మనం సంకల్పించాలని లక్ష్యంగా నేడు జాతీయ ఐక్యతా దినోత్సవాన్ని, ఐక్యతా పరుగును నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఆర్‌కె బీచ్ ఎన్టీఆర్ జంక్షన్ వద్ద జ్యోతి ప్రజ్వలన గావించి సర్దార్ వల్లభాయ్‌పటేల్ చిత్రపటానికి పూలదండలు వేసి అంజలి ఘటించి ఐక్యతా పరుగును జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి కలెక్టర్ శ్రీమతి జి.సృజన, రూరల్ ఎస్‌పి రాహుల్‌దేవ్‌శర్మ, డిసిసి ఫకీరప్ప, ఎయు వి.సి. నాగేశ్వరరావు, రిజిస్ట్రార్ ఉమామహేశ్వరరావు, జివిఎంసి కమిషనర్ హరినారయణన్, జెసి 2 డా.. సిరి, ఇన్‌చార్జి డి ఆర్ ఒ సత్తిబాబు, జిల్లా అధికారులు, పోలీస్, కళాశాలల విద్యార్థులు అధిక సంఖ్యలో ఐక్యతా పరుగులో పాల్గొన్నారు. కలెక్టర్ కార్యాలయంలో ఘనంగా సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి వేడుకలు సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి లో భాగంగా మంగళవారం ఉదయం కలెక్టర్ కార్యాలయంలో సిబ్బంది, అధికారులు ఘనంగా వేడుకలు నిర్వహించారు. సర్దార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి జెసి 2 డా.. సిరి, ఇన్‌చార్జి డి ఆర్ ఒ సత్తిబాబు పూలదండలువేసి నివాళులర్పించారు. అనంతరం డి ఆర్ ఒ కలెక్టర్ కార్యాలయం అధికారులు, సిబ్బందితో జాతీయ ఐక్యత దినోత్సవ ప్రతిజ్ఞను చేయించారు.

# పేదరికం నిర్మూలనే ఇందిరమ్మ లక్ష్యం

## పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు



విశాఖపట్నం : పేదరికం నిర్మూలనే ఇందిరమ్మ లక్ష్యమని ద్రోణంరాజు అన్నారు. మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ ఇందిరమ్మ వర్ధంతి సందర్భంగా మంగళవారం నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఆమె చిత్రపటానికి, విగ్రహానికి, జైలురోడ్డు దగ్గర వున్న ఇందిరమ్మ విగ్రహానికి పీసీసీ ప్రధాన కార్యదర్శి ద్రోణంరాజు శ్రీనివాసరావు, నగర కాంగ్రెస్ అధ్యక్షులు బెహరా భాస్కరరావు పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ద్రోణంరాజు మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రధానిగా దేశ ప్రజలు సుభిక్షంగా వుండాలని గరీభ్ హటావో నినాదంతో బ్యాంకుల జాతీయకరణ, రాజ ఆభరణాలు రద్దు చేశారని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కూడా చిన్నతనంలోనే చురుకైన పాత్ర వహించారని కొనియాడారు. అటువంటి మహనీయురాలిని ఆదర్శంగా తీసుకొని ప్రతి కార్యకర్త పనిచేయాలని సూచించారు. నగర కాంగ్రెస్ అధ్యక్షులు బెహరా భాస్కరరావు మాట్లాడుతూ ఇందిరమ్మ ప్రధానిగా ఆమె చేసిన సేవలు మరువలేమని అన్నారు. స్వాతంత్ర్య ఉద్యమం నుండి కూడా ఆమె దేశ ప్రజల కోసం పరితపించేవారని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉడా మాజీ ఛైర్మన్ పియస్ఎన్.రాజు, సేవాదళ్ ఛైర్మన్ పెంటపల్లి సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు యం.సత్యనారాయణరాజు, ముచ్చకర్ల దారప్ప, బండారు శ్రీనివాసరావు, శంకర్‌రావు, మల్లా ఈశ్వరరావు, కర్రి రామారెడ్డి, వార్డు అధ్యక్షులు ముప్పిడి గౌరీ ప్రసాద్, గురుమూర్తి, పి.వి.సత్యం, కస్తూరి వెంకటరావు తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఘనంగా జాతీయ ఐక్యతా దినోత్సవం




అచ్యుతాపురం: మాజీ ఉప ప్రధాని, ఉక్కు మనిషి సర్దార్ వల్లభాయ్‌పటేల్ కృషి ఫలితంగా 565 సంస్తానాలను భారతదేశంలో విలీనం చేసి దృడమైన సమైక్య భారతదేశంగా తీర్చిదిద్దారని జిల్లా బిజెపి మహిళా అధ్యక్షురాలు తోట విజయలక్ష్మి అన్నారు. మంగళవారం సర్దార్ వల్లబాయ్ పటేల్ జన్మ దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ ఐక్యత దినోత్సవం సందర్భంగా అచ్యుతాపురంలో నిర్వహించిన యూనిటి ఫర్ రన్ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. దేశాన్ని సమైక్యంగా ఉంచడంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ కీలక పాత్ర పోషించారన్నారు. నేటి యువత ఆయన నుండి స్పూర్తి పొంది రానున్న రోజుల్లో మరింత దృడమైన బారతదేశంగా అభివృద్ధి చెందేందుకు కృషి చేయాలనాన్నరు. అంతకు ముందు ఆమె స్థానిక బిజెపి నాయకులతో, ప్రశాంతి పాలిటెక్నిక్, కైట్స్ కాలేజ్ విద్యార్దినీ విద్యార్దులతో కలిసి బిజెపి కార్యాలయం నుండి నాలుగు రోడ్ల కూడలి వరకూ పరుగున ర్యాలీగా వెల్లి మానవహారంగా ఏర్పడి యూనిటి ఫర్ రన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బిజెపి యలమంచిలి నియోజకవర్గ కన్వీనర్ రాజాన సన్యాసినాయుడు (బిజెపి నాయుడు), బిజెపి జిల్లా ప్రదాన కార్యదర్శి గొంతిన భక్త సాయిరామ్, ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాల ఛైర్మెన్ దర్మిరెడ్డి ప్రసాద్, బిజెపి నాయకులు అరిశంకల శంకర్రావు, రాజాన రాజు, బి.వి.గోవిందరెడ్డి, పిట్టా దాసుబాబు, దొడ్డి సత్యనారాయణ, మేరుగు కాసు బాబు, సీరంరెడ్డి సావిత్రి, కైట్స్ విద్యా సంస్థల నిర్వాహకులు రెడ్డి చిరంజీవి, నాయుడు తదితరులు పాల్గొన్నారు.

# యాదవులకు చట్టసభల్లో తగిన గుర్తింపునివ్వాలి

## భరణికాన సాయినాధరావు



సబ్బవరం: యాదవులకు చట్ట సభల్లో తగిన గుర్తింపునివ్వాలని యాదవ సంఘం ఉపాధ్యక్షుడు పేర్కొన్నారు. స్థానిక ప్రభుత్వ అతిధి గృహంలో మంగళవారం భరణికాన బాబూరావు విలేకర్ల సమావేశంలో యాదవులకు చట్ట సభల్లో తగిన గుర్తింపునివ్వాలని అన్నారు. యాదవులంతా కలిసికట్టుగా ఉండాలని, అప్పుడే ఏదైనా సాధించవచ్చున్నారు. రానున్న ఎన్నికల్లో రాజకీయ పార్టీలు యాదవులకు తగిన గుర్తింపు నివ్వాలని కోరారు. విశాఖజిల్లా యాదవ సంక్షేమ సంఘం అడహక్ ఆధ్వర్యంలో డిసెంబర్ 03, 2017న సంఘం ఎన్నికలు జరుపుటకు నిర్ణయించడమైందని తెలిపారు. కావున యాద గ్రామ సంఘాలు తప్పక రిజిస్ట్రేషన్ చేసుకోవాలని కోరారు. సంఘానికి రూ.500లు రుసుము చెల్లించాలని, సంఘానికి చందా కట్టినవారే ఓటు హక్కు కలిగి వుంటారని తెలిపారు. ఈ నెల 25లోపు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. విశాఖ జిల్లా యాదవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శ్రీశ్రీశ్రీ రాధాకృష్ణ వేడుకులకు అందరూ హాజరుకావాలని పిలుపు నిచ్చారు. రాధాకృష్ణ వేడుకలు నవంబర్ 04, శనివారం శ్రీ రంగపురం గోకుల్ పార్కు సముద్ర తీరాన జరుగునని తెలిపారు. కార్తీక శుద్ధ పౌర్ణమినాడు రాధాకృష్ణ వేడుకలు జరిపించుటకు యాదవ కుల పెద్దలు నిర్ణయించారని తెలిపారు. ఈ వేడుకలకు అదేరోజు సాయంత్రం అత్యంత వైభవంగా జరుగునని, కావున అత్యధిక సంఖ్యలో భక్తులు హాజరుకావాలని కోరారు. సాంస్కృతిక కార్యక్రమాలు అనంతరం బహిరంగ సభలో ముఖ్య అతిధులతో బహుమతి ప్రధానోత్సవం జరుగునని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిల్లల అప్పలనాయుడు, గజ్జి నరసింగరావు, పల్ల తాతారావు, కొన సోమేశ్వరరావు, అప్పల రాజు, కోరాడ శ్రీను, మొల్లి చిన్నారావు, కొయ్య రమణ, రోమాల దేముడు తదితరులు పాల్గొన్నారు.

## ఉక్కు నగరంలో

# 'రన్ ఫర్ యూనిటీ'




గాజువాక: విశాఖ స్టీల్ ప్లాంట్ (ఆర్ఐఎన్ఎల్) ఆధ్వర్యంలో మంగళవారం "రన్ ఫర్ యూనిటీ" కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉక్కు మనిషి సర్ధార్ వల్లబాయ్‌పటేల్ జన్మదిన వార్షికోత్సవం సంధర్బంగా రాష్ట్రీయ ఏక్తా దివాస్ ఆద్వర్యంలో "రన్ ఫర్ యూనిటీ" ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఉక్కు డైరెక్టర్(పర్సనల్ ) కె.సి.దాస్ జెండా ఊపి ప్రారంభించారు. పాఠశాల విద్యార్థులు, ఉద్యోగులు ఉత్సాహంతో పాల్గొన్నారు. వియస్‌పిలోని వివిద విభాగాలలో ఉద్యోగులు రాష్ట్రీ ఏక్తా దివాస్, ఐక్యత, సమైక్యత నేషన్ నిర్వహించడానికి ప్రతిజ్ఞ చేసారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యార్థులకు యూనిటీ,వైవిద్యం అనే అంశంపై పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ (కార్పోరేట్ వ్యవహారాలు) ఆర్.పి శ్రీవాత్సవ్, హెచ్ఆర్ (జి.యం) ఆర్.వి.రావు, స్పోర్ట్స్ డిపార్ట్మంట్ అధికారులు పాల్గొన్నారు.

## జగన్ తలపెట్టిన

# పాదయాత్రను విజయవంతం చేయాలి



చంద్రమౌళిని అశ్వీరదిస్తున్న చర్చ్ ఫాదర్స్

మాధవధార : వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి తలపెట్టిన పాదయాత్ర ను విజయవంతం చేయాలని మంగళవారం 36వ వార్డు కంచరపాలెం జాతీయ రహదారి పక్కన ఉన్న జిసస్ క్రిస్ట్ ఫాస్టర్స్ అండ్ ఈవెంట్స్ వెల్ఫేర్ అసోషియేసన్ చర్చ్ అధ్యక్షులు ఎం.దేవానందం, ఫాదర్స్ సిహెచ్.శ్రీనివాస్‌పాల్, టి.పిటర్, ఆర్‌డి.సామ్సన్, కె.శాంతారావు, యు.బెంజిమన్‌లు ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించారు. అదేవిదంగా రానున్న ఎన్నికల్లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్.జగన్మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కావాలని ప్రార్ధనలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధులుగా ఉత్తర నియోజక వర్గం సమన్వయకర్త సనపల చంద్రమౌళి హజ రయ్యారు. ఈ సందర్భంగా చర్చ్ అధ్యక్షులు ఎం.దేవానందం మాట్లాడుతూ పేద ప్రజలు అభ్యున్నతికి కృషి చేసిన పార్టీ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అని అన్నారు. అదేవిదంగా ఉత్తర నియోజక వర్గం సమన్వయకర్త సనపల చంద్రమౌళి ట్రస్ట్ స్థాపించి అనేక సేవా కార్యక్రమాను నిర్వహించడం అభినందనీయమని అన్నారు. వితంతువులకు అదుకోవడం, విద్యార్దులకు ప్రొత్సాకాలు ఇవ్వడం అదేవిదంగా గ్రామాల్లో ఉచితంగా మెడికల్ క్యాంపులు నిర్వహించి మందులకు ఉచితంగా ఇవ్వడం వంటి అనేక సేవా కార్యక్రమాలను నిర్వహించడం ఎంతో అభినందనీయమని అన్నారు. ఈ సందర్భంగా సనపల చంద్రమౌళిని ఫాదర్స్ అశ్వీరదించారు. ఈ కార్యక్రమంలో బి.రాజు, ఫ్రాన్సిస్, శరత్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన ఎస్డీసీగా పి.శేషశైలజ



సింహాచలం : సింహాచలం దేవస్థానం భూపరిరక్షణ విభాగం నూతన ప్రత్యేక ఉప కలెక్టర్ (ఎస్డీసీ) గా పి శేషశైలజ మంగళవారం విధులకు హాజరైనారు. ముందుగా సింహాద్రి నాధుని దర్శనం చేసుకున్నారు. తరువాత కార్యనిర్వాహణాధికారి కోడూరి అచ్చుత రామచంద్రమోహన్ ప్రత్యేక ఉపకలెక్టర్ (ఎస్డీసీ) గా పి శేషశైలజకు జాయినింగ్ దస్త్రాలను అందజేశారు.

# హరిహరులకు ప్రీతికరమైన మాసం కార్తీకమాసం



సింహాచలం : కార్తీక ఏకాదశి సందర్భంగా సింహగిరి అంతటా హరి, హర నామాలతో తడిసి ముద్దయింది. సింహాద్రినాధుని ప్రాంగణంలో ఉన్న లక్ష్మీనారాయణుని సన్నిధిలో అధిక సంఖ్యలో లక్ష్మీనారాయణ వ్రతాలు జరిగాయి. అదే విధంగా కాశీవిశ్వేశ్వర, త్రిపురాంతక స్వామివారి ఆలయాల్లో అర్చనలు, అభిషేకాలు, ప్రత్యేకపూజలు అధిక సంఖ్యలో భక్తులు చేయించుకున్నారు. కార్తీకమాసం విశిష్టతను అర్చకస్వాములు వివరిస్తూ సంవత్సరంలో ప్రతి మాసానికీ ఒక్కొక్క విశిష్టత ఉంటుంది. అన్ని మాసాల్లోనూ కార్తికమాసానిది ఓ విశిష్టశైలి. దీనిని హరిహరులకు ప్రీతికరమైన మాసమంటారు. హరి స్థితికారకుడె%తే, హరుడు శుభంకరుడు. వీరిద్దరి ఆరాధన అంటే- మనం చరించే స్థితిగతి సవ్యంగానూ, ఆచరించే ప్రతీకర్మ శుభాలనిచ్చేదిగానూ ఉండాలన్న ఆశయసిద్ధికై అంతర్ముఖయానం గావించుకోవాలన్నదానికి ప్రతీక ఈ మాసమని చెబుతారు. ఈ మాసంలో ప్రాతఃకాలపు స్నానా లకు ఎంతో ప్రాముఖ్యమిస్తారు. ప్రాతఃకాలంలో చేసే స్నానం ఉత్తమమైంది. స్నానానంతరం రావి చెట్టు, తులసి, ఉసిరిక చెట్ల వద్ద దీపారాధన, దైవారాధన చెయ్యాలని శాస్త్రాలు చెబుతున్నాయి. జ్ఞానానికి చిహ్నం దీపం. సర్వసంపదలు జ్ఞానంవల్ల లభిస్తాయి. ఈ మాసంలో దీపదానం ప్రాశస్త్యం చాలా ఉంటుంది. ఈ మాసం ఆసాంతం దీపారాధన చేసి చివరిరోజున వెలుగు తున్న వెండి ప్రమిదను దానంచేస్తే- అనంత పుణ్య ఫలం, సకల ఐశ్వర్యాలు కలుగుతాయి.

# రెవెన్యూ సమస్యలు రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కరించుకోవాలి



రెవెన్యూ సదస్సులో రికార్డులు పరిశీలిస్తున్న తిరుపతిరావు

కొత్తవలస: గ్రామాలలో రైతులు రెవెన్యూ పరమైన సమస్యలు రెవెన్యూ సదస్సులలో పరిష్కరించుకోవాలని మండల ఆర్.ఐ. తిరుపతిరావు రైతులకు సూచించారు. కంచరుపల్లి పంచాయితీ కార్యాలయంలో జరిగిన రెవెన్యూ సదస్సులో ఆర్.ఐ. పాల్గొని రైతులకు సరైన సూచనలు సలహాలు చేసారు. గత సదస్సులో వచ్చిన అర్జీలను పరిశీలించిన పరిస్థితులను రైతులకు తెలియ జేసారు. పంచాయితీలో రెవెన్యూ సమస్యలను ఎంపిటిసి ఎం.కాశీ విశ్వనాధరావు అధికారులతో చర్చించారు. విఆర్ఓ సూర్యనారాయణ రైతులు పాల్గొన్నారు.

## విజిలెన్స్ శాఖపై

# అవగహన కలిగి ఉండాలి

## విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిఎస్‌పి సి.ఎం.నాయుడు



సబ్బవరం : విజిలెన్స్ శాఖపై ప్రజలు పూర్తి స్థాయిలో అవగహన కలిగి ఉండాలని విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ డిఎస్‌పి సి.ఎం.నాయుడు పేర్కున్నారు .ఈమేరకు విజిలెన్స్ అండ్ ఎన్ ఫోర్స్ మెంట్ ఎస్ .పి. డి.కొటేశ్వరరావు నేత్రుత్వంలో సబ్బవరం ,అనందపురం మండలాలలో గ్రామాల్లో ప్రజలకు, కళాశాల విద్యార్థులకు మంగళవారం ఉదయం విజిలెన్స్ పనితీరుపై అవగహన కల్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లడుతూ నేడు విశాఖ జిల్లా ఎంతగానో అబివృద్ధి చెందిందన్నారు. అటువంటి నగరంలో ప్రభుత్వ సంపదను కాపాడవలసిన అవసరం మనం దరిపై ఎంతైన వుందన్నారు. స్థానికంగా ఎవరైన ప్రభుత్వ సంపదతో అనధికార వ్యపారాలు నిర్వహించిన తమకు సమాచార మందించాలని కోరారు. దేశాభివృద్ధికి అవరోధంగా మారిన అవినీతిని రూపు మాపడానికి ప్రతిఒక్కరు నడుంబిగించాలని ఈసందర్భంగా పిలుపునిచారు. కార్యక్రమంలో డి.ఈ అజయ్ కుమార్, ఎ.ఈ రాం ప్రసాద్, సి.ఐ లు మల్లికార్జునరావు, నారీమణి, డి.సి.టి.ఒ మోహన్, ఎస్ఐ రమేష్ సిబ్బంది రెవెన్యూ సిబ్బంది గ్రామ పెద్దలు వివిద కళాశాలల విద్యార్థులు స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## విశాఖ డెయిరీ నిధులతో

# కల్వర్టులకు మరమ్మత్తులు

## టీడీపీ పట్టణ అధ్యక్షులు ఆడారి ఆనంద్‌కుమార్ వెల్లడి

యలమంచిలి రూరల్ : రైతులు, ప్రజలు ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశ్యంతో విశాఖ డెయిరీ నిధులు రూ.7లక్షలు వెచ్చించి రామారాయుడుపాలెం వద్ద కూలిన రోడ్డు కల్వర్టు పనులు చేపడుతున్నట్లు పార్టీ పట్టణ అధ్యక్షులు ఆడారి ఆనంద్‌కుమార్ అన్నారు. ఈ మేరకు ఆయన విజయభానుతో మాట్లాడుతూ సుమారు 25 రోజుల క్రితం ఈ రోడ్డు పై కల్వర్టు కూలిపోయిందన్నారు. దీంతో గ్రామస్థులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా రన్నారు. డెయిరీ నిధుల వెచ్చించి సత్వరం పనులు పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుం టామని ఆయన హామీ ఇచ్చారు.

కల్వర్టు నీటిపారుదలశాఖ పరిధిలో ఉన్నప్పటికీ డెయిరీ నిధులు ఉప యోగించి పనులు చేపడుతున్నట్లు తెలిపారు.

# వీఆర్వో పదవీ విరమణ

రోలుగుంట : మండలంలో కొండలపాలెం గ్రామంలో విఆర్ఒగా పని చేస్తున్న నిట్లా సింహాచలం పదవీ విరమణ చేశారు. మంగళవారం ఈ సందర్భంగా తహసీల్దార్ కార్యాలయంలో యూనియన్ నాయకులు రాజుల నాయుడు ఆధ్వర్యంలో పదవీ వివరణ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ పి.అప్పలనాయుడు మాట్లాడుతూ సింహాచలం అనారోగ్య సమస్యలున్నప్పటికీ విధి నిర్వహణలో అన్నిం టిలోనూ ముందుండేవారన్నారు. ఇక ముందు తన కుటుబంతో సంతోషంగా గడపాలని కోరుతున్నామన్నారు. అనంతరం సింహాచలం దంపతులకు ఘనంగా సన్మానించారు.

# దేశ ఐక్యత కోసం పటేల్ ఎంతో శ్రమించారు : ఈవో



సింహాచలం : సింహాచలం దేవస్థానము కార్యనిర్వహణాధికారి కోడూరిఅచ్చుత రామ చంద్రమోహన్, ఎస్డీసీ శేషశైలజ ఆధ్వర్యంలో సర్ధార్ వల్లభాయ్ పటేల్ 138వ జయంతి వేడుకలు జరిపారు. ముందుగా ఉక్కుమనిషి సర్ధార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలవేసి ఘన నివాళులు అర్పించారు దేశ ఐక్యత కోసం పటేల్ ఎంతో శ్రమించారని కార్యనిర్వహణాధికారి అన్నారు. బ్రిటిష్ వారికి వ్యతిరేకంగా స్వాతంత్ర ఉద్యమంలోనే కాకుండా దేశ ప్రజల సంక్షేమ కోసం అనేక సాంఘీక ఉద్యమాలను చేపట్టాడని కొనియాడారు. 1928లో బార్డోలీలో బ్రిటీష్ ఇండియా ప్రభుత్వం విధించిన పన్నులకు వ్యతిరేకంగా కిసాన్ ఉద్యమం చేపట్టి విజయవంతంగా నడిపించి దేశ ప్రజల దృష్టిని ఆకర్షించాడని అన్నారు. ఆయన దేశానికి చేసిన సేవలను ప్రతి ఒక్కరు స్పూర్తిగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. అదేవిధంగా ఉద్యోగులంతా ఒకే మెలగాలి అన్నారు. దేశ తొలి హోంశాఖ మంత్రి సర్దార్ వల్లభాయి పటేల్ అన్నారు . ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వల్లభబాయ్ పటేల్ ప్రముఖ స్వాతంత్ర యోధుడిగానే కాకుండా స్వాతంత్రానంతరం ఎన్నో సంస్థానాలు భారతదేశంలో విలీనం కావడానికి గట్టిగా కృషి చేసి సఫలుడైన ప్రముఖుడిగా పేరు పొందారని అన్నారు.

# ఘనంగా వెంకటేశ్వరస్వామి ఊరేగింపు



రావికమతం : ఏకాదశిని పురస్క రించుకొని మండలంలో గల కొత్తకోటలో శ్రీపద్మావతి భజన బృందం వారు వెంకటేశ్వరస్వామిని నగర సంకీర్తన చేపట్టారు. మంగళవారం గ్రామాలు స్వామివారి పాటలు, కీర్తనలు ఆలపిస్తూ గ్రామ పర్యటన చేశారు. తదనంతరం బృందం సభ్యురాలు పెనుగొండ రమా దేవి, రాజేశ్వరి, వడ్డాది దేవి తదితరులు మాట్లాడుతూ గత ఎనిమిదేళ్లుగా స్వామివారికి సేవలు చేస్తున్నామన్నారు. దీంట్లో భాగంగా మంగళవారం సాయంత్రం సామూహిక హారతి కార్యక్రమంతో పాటు శివాలయాల్లో రాత్రంతా పాటలు, భజనలతో పూజలు చేస్తామన్నారు. అలాగే బుధవారం స్థానిక శివాలయం వద్ద భారీ అన్నసమారాధాన కార్యక్రమం చేపడతామన్నారు.


శ్రీ వరాహలక్ష్మీ నృసింహస్వామివారి దేవస్థానం.. సింహాచలం..
విశాఖపట్నం జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 530028
ఇ-ప్రొక్యూర్‌మెంటు టెండరు ప్రకటన
ఫోన్ నెం. 0891-2764949, 8125420618 ఇ-మెయిల్: endow-eosvlnsd@gov.in,
ఆర్.సి.నెం బి1/3804/2017 తేది. 28.10.2017

శ్రీ స్వామివారి దేవాలయము శ్రీ కృష్ణాపుర గోశాలలో ఉన్న సుమారు 180 గోవులను సంరక్షణ చేయుటకు, అవసరమైన పనులు చేయుటకు మరియు నృసింహవనము నందు మొక్కల సంరక్షణ, తదితర పనులు చేయుటకు గాను 42 మంది అనుభవము యున్న అన్‌స్కిల్డ్ పనివారిని సప్లయి చేయుటకు ఇ-ప్రొక్యూర్‌మెంట్ ద్వారా టెండరు పిలవబడుచున్నది. టెండరు షెడ్యూలు డౌన్‌లోడు చేసుకొనుటకు తేది. 01.11.2017 ఉదయం గం॥ 11.00 నుండి తేది. 14.11.2017 మధ్యాహ్నం గం॥ 1.30 వరకు, మరియు ఇ-టెండరు (అప్‌లోడ్) సమర్పణ తేది. 14.11.2017 సా॥ గం॥ 4.00 వరకు మాత్రమే ఆన్‌లైన్‌లో దాఖలు చేయవలెను. ఇతర వివరములు ఇ.ప్రొక్యూర్‌మెంట్ ద్వారా షెడ్యూలు కొరకు www.apeprocurement.gov.in లేదా https://tender.apeprocurement.gov.in నందు చూడగలరు.

సం/- కె. రామచంద్రమోహన్
కార్యనిర్వహణాధికారి

# విజయభాను
## సంపాదకీయం

### మిషన్ కాకతీయ సక్సెస్

మిషన్ కాకతీయ పథకం ద్వారా చెరువుల పునరుద్ధరణ సత్ఫలితాలను ఇచ్చిందనేది మొదటి దశపై నాబార్డ్ కన్సల్టెన్సీ సర్వీస్ (నాబ్కాన్స్) అధ్యయనంలో వెల్లడికావడం సంతృప్తినిస్తున్నది. మిషన్ కాకతీయ వ్యవసాయాన్ని పండుగగా మార్చి పల్లెల్లో వెలుగులను నింపడమనేది చెరువులను పునరుద్ధరించిన గ్రామాల ప్రజల స్వీయానుభవం. అయినప్పటికీ కొందరు పనిగట్టుకొని దుష్ప్రచారం చేస్తున్న నేపథ్యంలో ఏదైనా విశ్వసనీయ సంస్థ చేత క్షేత్రస్థాయి అధ్యయనం సాగించి వాస్తవాలు వెల్లడించడం ప్రాధాన్యం సంతరించుకున్నది. రాష్ట్ర ప్రభుత్వం మిషన్ కాకతీయ మిగతా దశలను కూడా మరింత ఉత్సాహంగా సాగించడానికి ఈ అధ్యయన ఫలితాలు స్ఫూర్తినిస్తున్నాయి. నాబ్కాన్ బృందం తెలంగాణవ్యాప్తంగా భిన్న ప్రాంతాలలో మచ్చుకు కొన్ని గ్రామాలను ఎంపిక చేసుకొని అధ్యయనం చేసింది. ఈ అధ్యయనంలో వెల్లడైన అంశాలను పరిశీలిస్తే మిషన్ కాకతీయ విజయవంతమైందని స్పష్టంగా తెలుస్తుంది. చెరువుల పునరుద్ధరణ జరిగిన గ్రామాలలో ఆయకట్టు గణనీయంగా పెరిగింది. ఆయా గ్రామాలలో భూగర్భ జల మట్టం కూడా పెరిగింది. ప్రజలు చొరవ తీసుకొని స్వయంగా పూడిక మట్టిని తరలించుకపోయి పొలాల్లో చల్లుకున్నారు. దీనివల్ల రసాయన ఎరువుల వాడకం తగ్గడమే కాకుండా పంట దిగుబడి పెరిగింది. చెరువుల పునరుద్ధరణ జరిగిన గ్రామాలలో ప్రజల సామాజిక- ఆర్థికాభివృద్ధి గణనీయమైన రీతిలో చోటు చేసుకుందని కూడా ఈ అధ్యయనంలో వెల్లడైంది. వర్షపు నీటిని ఒడిసిపట్టుకొని నిలువ చేసుకొని పొలాలకు మళ్ళించడం అనేది ప్రపంచవ్యాప్తంగా ప్రశంసనీయమైన, పర్యావరణహితమైన నీటి విధానం. తెలంగాణలో శతాబ్దాలుగా అమలులో ఉన్న ఈ చెరువుల వ్యవస్థ పరాయిపాలనలో విధ్వంసానికి గురైంది. దీనిని మళ్ళా తెలంగాణ ప్రభుత్వం పునరుద్ధరించడం వల్ల పల్లెల్లో పచ్చదనం వెల్లివిరుస్తున్నది. ముంజేతి కంకణానికి అద్దమెందుకు అన్నట్టు చెరువుల పునరుద్ధరణ సత్ఫలితాలను ఇచ్చిందని గుర్తించడానికి హైదరాబాద్ చుట్టుపక్కల ప్రాంతాలను పరికించినా తెలిసిపోతుంది. రంగారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లోని పునరుద్ధరణ జరిగిన జలాశయాలు నిండు కుండల్లా తొణకిసలాడుతున్నాయి. వేసవిలోనూ చెరువులు నీటితో కళకళలాడుతున్నాయి. తెలంగాణలో చేపట్టిన ఈ ప్రాజెక్టు పట్ల దేశ విదేశాలలో అత్యంత ఆసక్తి వ్యక్తమవుతున్నది. ఈ పథకం దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని కేంద్ర జల వనరుల సంఘం సీఈ స్వయంగా ప్రశంసించారు. ఈ పథకాన్ని ఆదర్శంగా తీసుకొని దేశమంతటా అమలు చేయాలని కేంద్ర జలవనరు ల శాఖ మంత్రి ఆదేశాల మేరకు సీడబ్ల్యూసీ బృం దం తెలంగాణను సందర్శించింది. వివిధ రాష్ట్రాల చీఫ్ ఇంజినీర్లు దీనిని సబ్ కా వికాస్ మిషన్ అని శ్లాఘించారు. వాటర్ మాన్ ఆఫ్ ఇండియాగా గుర్తింపు పొందిన మెగసెసె అవార్డు గ్రహీత రాజేం ద్ర సింగ్ తెలంగాణకు చేరుకొని ఒక చెరువు గట్టుమీద తన పుట్టిన రోజును గడుపడం సాధారణ విషయం కాదు. మిషన్ కాకతీయ కార్యక్రమాన్ని దశలవారీగా కొనసాగిస్తూనే, చెరువుల పరిరక్షణ విషయంలో నాబ్కాన్స్ ఇచ్చిన సూచనలను పరిశీలించవలసి ఉన్నది. సాధించిన విజయాన్ని సుస్థిరం చేసుకోవాలె. చెరువుల పునరుద్ధరణ ఫలితా న్ని అనుభవిస్తున్న గ్రామీణులు వాటి పరిరక్షణ కూడా తమ బాధ్యత అని గుర్తించాలె. చెరువు నీటిని పొదుపుగా వాడుకోవాలె. నీటి నిలువలను గమనించుకుంటూ తదనుగుణంగా పంటలను ఎంపిక చేసుకోవాలె. శాస్త్రీయ పద్ధతుల్లో సాగు చేస్తూనే, మార్కెట్‌ను గమనించడం అలవరుచుకోవాలె. ఆధునిక వ్యవసాయ విధానాలు, ఉత్పత్తి, నిలువ, మార్కెటింగ్ మొదలైన వివిధ దశలలో ప్రభుత్వం ఇస్తున్న సూచనలను గమనంలోకి తీసుకోవాలె. పూర్వం చెరువుల మరమ్మతులలో, పరిరక్షణలో సర్కారుతో పాటు, ప్రజల భాగస్వామ్యం కూడా ఉండేది. చెరువు కట్ట తెగితే అప్పటికప్పుడు రైతులు ముందుకు వచ్చి మరమ్మతు చేసుకునేవారు. మళ్ళా అదే చొరవను కనబరుచాలె. ఇప్పుడు కూడా చెరువుల పూడిక తీసేకొద్దీ ప్రజ లు స్వయంగా మట్టిని తరలించుకపోయి తమ పొల్లాల్లో పోసుకుంటున్నారు. ఒక్క పూడిక మట్టి విషయంలోనే కాదు, మొత్తం చెరువుల సంరక్షణ తమ బాధ్యత అని గుర్తించాలె. ముఖ్యమంత్రి కేసీఆర్ సోమవారం శాసనసభలో హరితహారం పథకం విషయమై మాట్లాడుతూ గ్రామాలు క్రియాశీలంగా మారే వరకు మార్పు రాదని చెప్పడం గమనార్హం. ప్రజలు చైతన్యవంతమై సద్వినియోగం చేసుకోనప్పుడు, రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని పథకాలు పెట్టి, ఎన్ని నిధులు ఇచ్చినా ప్రయోజనం ఉండదు. ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నా ప్రజలే ముందుకు రావాలె.

## బీజేపీకి ఝలక్.. వద్దంటే వదిలేయండి!



ముంబై : సంకీర్ణ ప్రభుత్వంలో ఉంటారో వెళ్తారో తేల్చుకోండి అంటూ మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ విసిరిన సవాలుకు మిత్రపక్షం శివసేన ఘాటుగా బదులిచ్చింది. మాతో పొత్తు వద్దనుకుంటే నిరభ్యంతరంగా వదిలేయండి అని సేన తన అధికారిక పత్రిక సామ్నాలో పేర్కొంది. అసెంబ్లీ శీతాకాల సమావేశాల్లోపే కేబినెట్ పునర్వ్యవస్థీకరణ ఉంటుందన్న వార్తల నేపథ్యంలో బీజేపీ-సేన మైత్రికి తెరపడే అవకాశాలున్నట్లు ఊహాగానలు వినిపిస్తున్నాయి. వాటికి తగ్గట్లే నేతల విమర్శలు కూడా శృతిమించాయి.

త్వరలో కేబినెట్ పునర్వ్యవస్థీకరణ? : గతవారం ఓ కార్యక్రమంలో సీఎం ఫడ్నవిస్ మాట్లాడుతూ.. భాగస్వామిగా ఉంటూ ప్రభుత్వ నిర్ణయాలపై ఎడతెగని విమర్శలు గుప్పించడం శివసేనకు తగదని, సంకీర్ణప్రభు త్వంలో ఉండాలో బయటికి వెళ్లాలో ఉద్ధవ్ ఠాక్రే నిర్ణయించుకోవాలని వ్యాఖ్యానించారు. అంతకు ముందోసారి.. శీతాకాల సమావేశాల్లోపే కేబినెట్ పునర్వ్యవస్థీకరణ జరగొచ్చని సీఎం అన్నారు. మహారాష్ట్ర మాజీ సీఎం, ఇటీవలే కాంగ్రెస్ నుంచి బయటికొచ్చిన నారాయణ రాణేకు ఫడ్నవిస్ తన కేబినెట్‌లో చోటు కల్పించబోతున్నట్లు సమాచారం.

బీజేపీ మా సైద్ధాంతిక శత్రువు : సందర్భం చిక్కినప్పుడల్లా బీజేపీపైనా, ప్రధాని మోదీపైనా సెటైర్లు వేస్తోన్న శివసేన ఎంపీ సంజయ్ రౌత్.. సోమవారం కూడా అదేపని చేశారు. శివసేనకు బీజేపీ సైద్ధాంతిక శత్రువని, కేవలం ప్రభుత్వం నడవటం కోసమే తాము మద్దతు ఇచ్చామని అన్నారు. అంతకుముందు ఆయన.. మోదీ ప్రభ తగ్గిపోయిందని, రాహుల్ గాంధీయే దేశాన్ని నడిపించగల నాయకుడని చేసిన వ్యాఖ్యలు సేన-బీజేపీల మధ్య చిచ్చుకు కారణమయ్యాయి. రౌత్‌కు కౌంటర్‌గా సీఎం ఫడ్నవిస్ సవాలు చేస్తే, ఇప్పుడు ఫడ్నవిస్‌కు సేన ఘాటు సమాధానమిచ్చింది.

## ఢిల్లీ విమాన ప్రయాణికులకు ముఖ్య గమనిక....



ఢిల్లీ : ఢిల్లీలోని ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయ అధికారులు ప్రయాణికులకు ముఖ్యమైన గమనిక అంటూ ఓ ప్రకటన చేశారు. వచ్చే నెల (నవంబరు) 7 నుంచి మూడురోజుల పాటు ఢిల్లీ విమానాశ్రయంలోని మూడు రన్ వేలకు మరమ్మతులు చేపడుతున్నందున 30 శాతం విమానసర్వీసులను రద్దు చేస్తున్నట్లు విమానాశ్రయ అధికారులు చెప్పారు. సాధారణంగా ఢిల్లీ విమానాశ్రయంలో గంటకు 67 విమానాలు వచ్చిపోతుంటాయి. కాని మూడు రన్ వేలకు మరమ్మతులు చేపడుతున్నందు వల్ల గంటకు వచ్చి పోయే విమానాల సంఖ్యను 45కు తగ్గించామని అధికారులు పేర్కొన్నారు. నవంబరు 7 నుంచి 10వతేదీ వరకు దాదాపు 300 విమాన సర్వీసులను రద్దు చేస్తున్నట్లు విమానాశ్రయ అధికారులు ప్రకటించారు. ఈ విషయాన్ని ఢిల్లీకి వచ్చి పోయే విమాన ప్రయాణికులు గమనించాలని విమానాశ్రయ అధికారులు కోరారు. విమానాశ్రయంలో మరమ్మతు పనుల వల్ల కొన్ని విమాన సర్వీసులను రద్దు చేశామని ఇండిగో, స్పైస్ జెట్ ఎయిర్ వేస్‌లు ఇప్పటికే ప్రకటించాయి.

## ఉ.కొరియా చేతికి కిమ్ మర్డర్‌ప్లాన్..!
### ద.కొరియా నావికదళ గుట్టు హ్యాక్



సియోల్: ఉత్తరకొరియా గత ఏడాది చేసిన ఓ భారీ సైబర్ దాడి తాజాగా వెలుగులోకి వచ్చింది. ఇది ప్రపంచవ్యాప్తంగా ఇప్పుడు పెను ప్రకంపనలు సృష్టిస్తోంది. దక్షిణ కొరియాకు చెందిన కీలక రహస్యాలను ఈ దాడిలో ఉ.కొరియా చేజిక్కించుకుంది.

వీటిలో కిమ్ మర్డర్ ప్లాన్ కూడా ఉన్నట్లు సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్ తన కథనంలో పేర్కొంది. వీటితో పాటు దక్షిణ కొరియా యుద్ధనౌకల బ్లూప్రింట్లు ఉత్తరకొరియా చేతికి చిక్కాయి. ప్రపంచంలోనే అతిపెద్ద నౌకల నిర్మాణ కంపెనీ దేవూ షిప్ బిల్డింగ్, మారియన్ ఇంజినీరింగ్‌లకు చెందిన 40,000 పత్రాలు ఉ.కొరియా చేజిక్కించుకుంది. వీటిల్లో అత్యంత కీలకమైన 60 పత్రాలు కూడా ఉన్నాయి.

దక్షిణ కొరియాకు చెందిన పలు కీలక యుద్ధనౌకల నిర్మాణ సాంకేతికత, బ్లూప్రింట్లు, ఆయుధ వ్యవస్థ, నౌకలు, సబ్‌మెరైన్లకు సంబంధించి ఆవిష్కరించిన అధునాతన పరిజ్ఞానాన్ని ఉత్తర కొరియా హ్యాక్ చేసింది. ఉత్తర కొరియా క్షిపణులతో తొలుత దాడి చేస్తే ఏ విధంగా ఎదుర్కోవాలో తెలియజేసే ప్రణాళిక కూడా వీటిల్లో ఉంది.

**కిమ్ హత్య పథకం కూడా..!**

ఉత్తర కొరియా అధినేత కిమ్ జోంగ్ ఉన్‌ను మట్టుబెట్టడానికి అమెరికా- దక్షిణ కొరియాలు వేసిన ప్లాన్ కూడా హ్యాక్ ద్వారా లభించిన పత్రాల్లో ఉన్నట్లు తెలుస్తోంది. గత నెల దక్షిణ కొరియా నాయకుడు ఒకరు ఈ విషయాన్ని వెల్లడించారు. ఉత్తరకొరియా హ్యాకర్లు తమ సైనిక ప్రణాళికలను కూడా దొంగిలించినట్లు సదరు నాయకుడు పేర్కొన్నారు. వీటిలో కిమ్‌ను మట్టుబెట్టే పథకం కూడా ఉందని తెలిపారు. మరోపక్క బ్రిటన్‌కు చెందిన నేషనల్ హెల్త్ సిస్టమ్‌పై ఉత్తరకొరియా హ్యాకర్లు దాడి చేసినట్లు ఆరోపణలు వచ్చాయి.

**ఖండించిన ఉ.కొరియా**

ఈ హ్యాకింగ్ ఆరోపణలను ఉత్తరకొరియా ఖండించింది.

సైబర్ క్రైమ్ ఆరోపణల్లో తమకు ఎలాంటి సంబంధం లేదని పేర్కొంది. ఈ విషయాన్ని కొరియన్ సెంట్రల్ న్యూస్ ఏజెన్సీ పేర్కొంది.

## కవి సమయం

### ఇబ్బందే

ఉన్నత చదువులు చదివేము-ఫలితం అంతంతే...?
కొందరు వరకే ఫలితం ఇంతంతే...
కమ్మరి శాల్లో సమ్మెట్టేద్దామంటే... పనిలేదు
మోపులు మోస్తామంటే... చేతారపని కరువే...
'కబలం' రెండు పూటలు కలిమేది?
సవ్యంగ పాలన విధానం విధులేవి?
ఓటులు రాజ్యం వ్యాపారం
ఆకాశం తాకిన ధరలే...
చూద్దాం ఎన్నాళ్ళో - బతికి నన్నాళ్ళు...
మారేదంది- ముందుంది
ఆ... జనాలతో నడుస్తుంది
సుభిక్ష పాలన అంటుంది
మత్తుకు (నిసానీరు) అలవాటు - కొందరంటు
అనారోగ్యాలుతో వారంటు- మందులు మింగుట కర్మంటు
శాస్త్రవేత్తలు విజ్ఞాననం - ఎన్నెన్నో విధాలు
ప్రపంచానికే వెలుగులు - వారి మార్గాలు
దేవతలంత ఎప్పుడు భారత పుడిమిన అడుగులు పెడతారు
భారత భూమికి మోక్షం పడుతుందంటాము
అమ్మ, నాన్న మాటలు తగ్గి
మమ్మీ, డాడి మాటలు పెరిగి
మాట, మాట ఫలుకులకు
ఆంగ్ల పదాలే జోరంటు
ఇదేమి తంటా...
మన తెలుగుభాష పోతుంది మన యింట

...కవితా రచన
మజ్జి శ్యామసుందరరావు
సెల్ నెం:9290839512

## పంచాంగం

మాసం : కార్తీక, ద్వాదశి మ.2.38; ఉత్తరాభాద్ర తె.5.18; మ.వ.2.46ల 4.20

బుధవారం 01 -11-2017

**మేషం:** మీ చుట్టు ప్రక్కల వారితో మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. వైద్యులకు శస్త్రచికిత్సలలో ఏకాగ్రత మెళకువ చాలా అవసరం. ఉద్యోగస్తులు పైఅధికారుల నుంచి మంచి గుర్తింపు లభిస్తుంది. వస్త్ర వ్యాపారులు పనివారలను ఓ కంట కనిపెట్టుకుని ఉండటం శ్రేయస్కరం. **వృషభం** : కోర్టు వ్యవహారాలు వాయిదా పడటం మంచిది. స్త్రీలకు దైవ, పుణ్యకార్యాల పట్ల ఆసక్తి పెరుగుతుంది. సిమెంటు, కలప, ఇటుక వ్యాపారస్తులకు పురోభివృద్ధి కానవస్తుంది. **మిథునం** : ప్రముఖుల ఇంటర్వ్యూ కోసం పడిగాపులు తప్పవు. సోదరి, సోదరులతో ఉల్లాసంగా గడుపు తారు. దైవ దర్శనాల వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుంది. ఆత్మస్థైర్యంతో శ్రమించి అనుకున్నది సాధిస్తారు. **కర్కాటకం** : బ్యాంకుల్లో మీ పనులకు స్వల్ప ఆటంకాలు ఎదురవుతాయి. ఇతరులకు వాహనం ఇవ్వటం వల్ల సమస్యలు తలెత్తుతాయి. అకాల భోజనం, విశ్రాంతి లోపం వల్ల ఆరోగ్యం మందగిస్తుంది. స్థిరాస్తి విక్రయానికి ఆటంకాలు తొలగి పోగలవు. చెప్పుడు మాటలకు ప్రాధాన్యమివ్వటం మంచిది కాదని గ్రహించండి. **సింహం** : సంఘంలో మీ మాటకు మంచి గుర్తింపు, రాణింపు లభిస్తుంది. ఉద్యోగ రీత్యా దూర ప్రయాణాలు చేయవలసి వస్తుంది. సినిమా, సంగీత, నృత్య కళాకారులకు సన్మానాలు వంటివి జరుగుతాయి. కుటుంబ సమస్యల నుండి బయటపడతారు. స్త్రీలకు టి.వి కార్యక్రమాలకు సంబంధించిన ఆహ్వానాలు అందుతాయి. **కన్య** : మీ కళత్ర మొండి వైఖరి మీకు ఎంతో చికాకు కలిగిస్తుంది. పాత వస్తువులను కొని సమస్యలు తెచ్చుకోకండి. స్త్రీలకు అయిన వారి ఆరోగ్యం కలవరపరుస్తుంది. ముఖ్యమైన వ్యవహారాల్లో బిజిగా ఉంటారు. బ్యాంకు వ్యవహారాలు మందకొడిగా సాగుతాయి. **తుల** : ఉత్తర ప్రత్యు త్తరాలు సంతృప్తినిస్తాయి. వ్యాపారాల అభివృద్ధికి బాగా శ్రమిస్తారు. స్త్రీలకు సంపా దన పట్ల ఆసక్తితో పాటు అవకాశాలు కలిసిరాగలవు. రుణం తీర్చి తాకట్టు వస్తువులను విడిపిస్తారు. ప్రముఖుల కలయిక వల్ల ఏమంత ప్రయోజనం ఉండదు. సంఘంలో పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు పెంచు కుంటారు. **వృశ్చికం** : నిరుద్యోగులు నిరుత్సాహం వీడి ఆత్మ విశ్వా సంతో యత్నాలు కొనసాగించటం మంచిది. పెద్దలను, ప్రముఖులను కలుసుకొని వారికి బహుమతులు అందజేస్తారు. **ధనుస్సు** : ంవ్యాపారాల్లో పోటీని తట్టు కుంటారు. మీ కార్యక్రమాలలో స్వల్ప మార్పులుంటాయి. కాంట్రాక్టర్లకు ఏకాగ్రత లోపం వల్ల చికాకులు తప్పవు. **మకరం** : స్త్రీలకు బంధు, మిత్రులతో మంచి గుర్తింపు రాణింపు లభి స్తుంది. కొబ్బరి పండ్లు, పూలు, చిరువ్యాపారులకు లాభదాయకంగా ఉంటుంది. మీ అలవాట్లు బలహీనతలు అదుపులో ఉంచుకోవడం మంచిది. రాజకీయాల లోని వారికి సమస్యలు తలెత్తుతాయి . **కుంభం** : వృత్తి ఉద్యోగాల్లో తలెత్తిన ఆటంకాలు తొలగిపోగలవు. దైవ సేవ, పుణ్యకార్యాల్లో పాల్గొంటారు. ఉపాధ్యాయిలకు సదవకాశాలు లభిస్తాయి. కోర్టు వ్యవహారాలు అనుకున్నంత సాఫీగా సాగవు. **మీనం** : కోర్టు వ్యవహారాల్లో ప్లీడర్లకు చికాకులు తప్పవు. ఖర్చులు, చెల్లింపులు ప్రయోజనకరంగా ఉంటాయి. విదేశీ యానం కోసం చేసే యత్నాల్లో స్వల్ప చికాకులు ఎదుర్కొంటారు.

## అయ్యప్ప చింతనతో...

## సంకీర్తన



### అయ్యప్ప ఎవరు..!

హరిహర సుతుడుగా అయ్యప్ప అవతరించినట్టు చరిత్ర చెపుతుంది. అయితే ఒకప్పటి కాలానికి వెడితే, విష్ణువుని ఆరాధించే వారిని వైష్ణవులని, శివుణ్ణి ఆరాధించేవారిని శైవులని, బ్రహ్మని ఆరాధించే వారంతా బ్రాహ్మణులని వర్గీకరణ జరిగింది. అయితే శృష్టిస్థితిలయ కారకులుగా రూపుదిద్దుకున్న ఆ పరమేశ్వరుని రూపాన్ని , భగవంతుడు ఒక్కడే అనే నిజాన్ని విస్మరించి, ఈ త్రిమూర్తులలో ఎవరు ఎక్కువ అనే తత్వం ఈ మూడు వర్గాల్లోనూ తలెత్తింది. విష్ణువే ఎక్కువ అని వైష్ణవులు, శివుడే ఎక్కువ అని శైవులు వాదించుకోవడం మొదలు పెట్టి, హత్యలు చేసుకునే స్థితికి చేరుకున్నారు. బ్రాహ్మణులు ఇద్దరి మధ్య మీమాంశలో పడి కొందరు వైష్ణవుల్లోను, అత్యధిక శాతం శైవుల్లోను కలిసపోయారు. శైవుల మధ్య వైష్ణవుల మధ్య విపరీతంగా పెరిగిపోయిన విబేధాల వల్ల రక్తపాతం జరుగుతూ వుండేది. హిందూ సమాజం అస్తవ్యస్థంగా మారింది. చివరికి విష్ణు భక్తులు పెట్టుకునే నామాలు కూడా శైవులు నాకి అవమానించేవారు. ఆ కోపావేశంలో శైవుల్ని హత్యచేయడానికి విషం కలిపిన నిలువునామాలు పెట్టుకునేవారు. వీరి నామాలు నాకిన శైవులు విప్రపభావంతో మరణించేవారు. ఎవరికి వారు మా మతం గొప్పదంటే, మా మతం గొప్పది అంటూ ఆధిపత్యపోరు నిరంతరం సాగిస్తూవుండటంతో సమాజంలో అశాంతి ప్రబలి పోయింది. సాధారణ ప్రజానీకం కూడా ఎవరు ఏమిటో తెలియని వాతావరణంలో కుమ్ములాటలకి దిగడం పరిపాటిగా మారింది. చివరికి రాజవంశాల్లో కూడా ఇదమిద్ధంగా సరైన అవగాహన లోపించడంతో రారాజులు, మహారాజులు కూడా ఈ విషయంలో నిర్లిప్తధోరణి పాటించారు.

సమైక్యతకి కొందరు ప్రయత్నించినా ఫలితం అంతగా కనిపించలేదు. ఇంతటి అస్థిర పరిస్థితిని అదుపుచేసి, సుస్థిర సమాజస్థాపనకోసం హరిహరులు ఒక్కరే అని చేప్పే నేపథ్యంలో హరిహర సుతుడుగా ఇద్దర్నీ ఏకంచేస్తూ ఉద్భవించినవాడే అయ్యప్ప.

### అయ్యప్ప చరిత్ర

ఏ పురాణేతిహాసాల్లోను మనకి తెలిసినంతవరకూ అయ్యప్ప ప్రస్తావన ఉండదు. అయితే భస్మాసురుని సంహ రించడంకోసం శ్రీహరి జగన్మోహినిగా అవతరించడం, భస్మాసురుడికి వరాన్ని అనుగ్రహించి తన నెత్తిమీదికి తెచ్చుకుని కష్టాల్లో పడిన పరమ శివుణ్ణి రక్షించడం, జగన్మోహినిగా ఉన్న శ్రీహరిని చూసి శివుడు మోహించి కొంతకాలం తనతో దాంపత్యం చేయడం, ఆ దాంపత్య కారణంగా ఒక బాలుడు పుడతాడు. అవతార పరిసమాప్తం అవుతున్న సమయంలో ఆ కుర్రవాణ్ణి శివకేశవులు ఒంటరిగా ఆ అడవిలో విడిచి పెడుతూ, ఇతర జంతుజాలంతో ఇతనికి ఎటువంటి ఆపదా కలుగకుండా రక్షగా మెడలో ఒక మణిని వేసి ఇద్దరు తమ లోకాలకు వెళ్ళిపోతారు. అక్కడితో ఆ ఇతిహాసం పూర్తవుతుంది.

అయితే ఆ ప్రాంతాన్ని పరిపాలించే రాజు వేటకు రాగా ఆ అడవిలో హరిహరులకు పుట్టిన కుర్రవాడు ఒంటరిగా దొరకుతాడు. పిల్లలు లేని ఆ మహారాజు ఆ కుర్రవాణ్ణి దైవప్రసాదంగా భావించి తన రాణి చేతిలో ఉంచి, మణిసహితంగా దొరికిన కారణంచేత మణికంఠుడు అనే నామకరణం చేస్తారు.

యుక్తవయసు వచ్చిన మణికంఠుడికి పట్టాభిషేకం చేయాలన్న తలంపుతో అతనిని సంప్రదించగా, అందుకు మణికంఠుడు తాను ధర్మసంస్థాపనకోసమే పుట్టిన కారణంచేత, తన తరువాత ఆ రాజదంపతులకు కలిగిన సంతానానికే పట్టాభిషేకం చేయమని, తాను బ్రహ్మచారిగా అడవికి పోయి తన అవతార కార్యక్రమాన్ని నిర్వహిస్తాననీ చెప్పి, రాజ్యత్యాగం చేసి శబరిగిరిని చేరతాడు.అక్కడి నుంచి హరిహర సుతుడుగా, అయ్యప్పగా, ధర్మశాస్తగా పిలవబడుతూ, అవతార విశేషం పూర్తి అవ్వగానే అదే శబరిగిరి మీద వెలిసి ఇప్పుడు అందరి పూజలూ, సేవలూ అందుకుంటున్నాడు.

రోజుకి రూ. 25/- మాత్రమే
Size 1x3
విజయభాను క్లాసిఫైడ్స్
Minimum 7 days
సంప్రదించవలసిన ఫోన్ నెంబర్ : 2564353, 2569004

## ప్రతి గ్రామంలో మరుగుదొడ్లు నిర్మించాలి

దత్తిరాజేరు: మండల అభివృద్ధి కార్యలయంలో ఎంపిడిఓ కె.వి.ఆర్.పట్నాయక్ మాట్లాడుతూ మండలంలో ప్రతి గ్రామంలో అందరు మరుగుదొడ్లను నిర్మించి, వాడే విధంగా చెయ్యాలని ఫీల్డ్ అసిస్టెంట్‌లు, పంచాయితీ కార్యదర్శిలు గ్రామ నాయకులు అందరు కూడా ఒక యజ్ఞంలా మరుగుదొడ్లను నిర్మించి, వాడే విధంగా చెయ్యాలని కోరారు.

## దివ్యాంగులకు సేవ చేయడం గొప్ప విషయం

### తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు




కొత్తవలస: దివ్యాంగులకు సేవ చేయడం గొప్ప విషయంమని తహశీల్దార్ కోరాడ శ్రీనివాసరావు అన్నారు. మంగళపాలెంలో గల శ్రీ గురుదేవ్ చారిటబుల్ ట్రస్ట్ ఆద్వర్యంలో మంగళవారం జరిగిన వికలాంగులకు కృత్రిమ అవయావాలు పంపిణీ కార్యక్రమానికి తహశీల్దార్ ముఖ్యఅతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పుణ్య క్షేత్రాలు తిరుగుళ్ళు తిరగడం కంటే దివ్యాంగులకు సేవ చేయడం ఎంతో అదృష్టమని, ట్రస్ట్ వ్యవ స్థాపకులు జగదీష్ బాబు సేవలు వెల కట్టలేనివని అన్నారు. ఈ సందర్భంగా 10 మంది దివ్యాంగులకు కృత్రిమ అవయవాలు, 100 మంది పేదలకు బియ్యం పంపిణీ చేసారు. ఈ కార్యక్రమంలో ట్రస్టు సభ్యులు పాల్గొన్నారు.

## నవంబర్ నుంచి పాఠశాలల్లో బయోమెట్రిక్ తప్పనిసరి

### ఎంఇఒ అమృతకుమార్


నాతవరం : నవంబర్ నుంచి తప్పనిసరిగా పాఠశాలల్లో బయోమెట్రిక్ విధానాన్ని విధిగా అమలు చేస్తామని నాతవరం మండల విద్యాశాకాధికారి టి.అమృతకుమార్ చెప్పారు. ఈ మేరకు ఆయన విలేకరులతో మాట్లాడారు. దీనిపై ఇప్పటికే హెచ్ఎంలతో సమావేశం ఏర్పాటు చేశామన్నారు. కొన్ని పాటశాలకు ఎన్ఐఆర్ఐ సౌజన్యంతో విద్యార్థులకు తరగతుల బోదనకు సామగ్రిని అందించామన్నారు. ఆయా పాఠశాలల్లో వీటిని సక్రమంగా వినియోగించాలని సూచించారు. విద్యార్థుల పూర్తి డేటాను ఆన్‌లైన్‌లో నమోదు చేయడంతో పాటు ఎప్పటికప్పుడు వీరి హాజరును ఆన్‌లైన్‌లో పొందుపర్చాలన్నారు. వీటితో పాటు పాత పద్ధతి ప్రకారం పాఠశాలల్లో రికార్డుల నిర్వహణ తప్పనిసరి అని, మధ్యాహ్న భోజనం పథకం అమలుపై ప్రత్యేక శ్రద్ధ సారించామన్నారు.

## పోలీసుశాఖ ఆధ్వర్యంలో జాతీయ సమైఖ్యతా ప్రతిజ్ఞ



విజయనగరం: స్ధానిక జిల్లా పోలీసు కార్యాలయంలో గల సమావేశ మందిరంలో మంగళవారంనాడు భారత ప్రదమ ఉప ప్రధానమంత్రి, ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని ఘనంగా నిర్వహించింది. విజయనగరం జిల్లా ఎస్పీ జి.పాలరాజు డిపిఒ సమావేశ మందిరంలో సర్ధార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాల వేసి, ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ స్వాతంత్ర్య ఉద్యమంలో సర్ధార్ వల్లభాయ్ పటేల్ చాలా క్రియాశీలక పాత్ర పోషించారన్నారు. భారత ఉప ప్రధానిగా దేశానికి విశిష్టమైన సేవలందించారని, నవ భారత నిర్మాణంలో వల్లబాయ్ పటేల్ అందించిన సేవలు చిరస్మరణీయమనన్నారు. దేశానికి వల్లబాయ్ పటేల్ అందించిన సేవలకుగాను భారతరత్న బిరుదును అందుకున్నారన్నారు. అనంతరం, జిల్లా ఎస్పీ ఆధ్వర్యంలో జిల్లా పోలీసు కార్యాలయ సిబ్బంది, పోలీసు అధికారులు రాష్ట్రీయ ఏఖ్‌తా దినోత్సవం సందర్భంగా జాతీయ సమైఖ్యతా ప్రతిజ్ఞను నిర్వహించారు. దేశ ఐక్యమత్యం, సమగ్రత, భద్రతను కాపాడటానికి స్వయంగా అంకితమవుతామని పోలీసు అధికారులు, సిబ్బంది ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అట్టాడ వెంకట రమణ, ఎస్సీ ఎస్టీ సెల్ డిఎస్పీలు, టి.త్రినాథ్, గురుమూర్తి, సిసిఎస్ ఎ.ఎన్ చక్రవర్తి, ఎఆర్‌డిఎస్పీ ఎ.ఎస్.చక్రవర్తి డిపిఓ పరిపాలనాధికారి మండల్, రిజర్వు ఇన్స్‌స్పెక్టర్లు శ్రీహరిరావు, రామకృష్ణ, శంకర రావు ఇతర పోలీసు అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

## మామిడి అరుణకుమారికి శుభాకాంక్షలు



నర్సీపట్నం : 3వ వార్డు కౌన్సిలర్ మామిడి అరుణకుమారి జిల్లా రూరల్ తెలుగు మహిళా ఉపాధ్యక్షులుగా ఎన్నికైన సందర్భంగా చైర్ పర్శన్ అనిత, వైస్ చైర్మన్ సన్యాసిపాత్రుడు, మార్కెట్ యార్డు చైర్మన్ అడిగర్ల అప్పలనాయుడు శుభాకాంక్షలు తెలియజేసి శుభాకాంక్షలు తెలిపారు. అదే విధంగా మున్సిపల్ కౌన్సిలర్లు కూడా ఆమెకు శుభాకాంక్షలు తెలిపారు.

## మృతి చెందిన కానిస్టేబుళ్ళ కుటుంబాలకు సహాయపడిన బ్యాచ్‌మేట్స్



విజయనగరం: స్ధానిక పట్టణం 2వ పట్టణ పోలీసు స్టేషనులో పనిచేస్తూ, అనారోగ్య కారణాలతో మృతి చెందిన కానిస్టేబులు విశాఖ పట్టణం గ్రేహౌండ్స్‌లో పనిచేస్తూ ప్రమాదవసాత్తు మృతి చెందిన కానిస్టేబులు కుటుంబాలకు వారి బ్యాచ్‌మేట్ కానిస్టేబుళ్ళు ఆసరాగా నిలిచారు. విజయనగరం 2వ పట్టణ పోలీసు స్టేషనులో పనిచేస్తూ, అనారోగ్య కారణాలతో కానిస్టేబులు జి.రామారావు తే.07-10-2017దిన మృతి చెందారు. కానిస్టేబుల్‌తో పాటు శిక్షణ పొందిన 1995 బ్యాచ్‌కు కానిస్టేబుళ్ళు తమ సహ ఉద్యోగి మరణాన్ని జీర్ణించుకోలేక పోయారు. బ్యాచ్‌మేట్స్ అంతా తమవంతుగా సహాయం చేయాలని భావించి, రూ.50 వేలును సేకరించి జిల్లా ఎస్పీ జి.పాలరాజు చేతులు మీదుగా వారి కుటుంబ సభ్యులకు అందజేసారు. అదే విధంగా జిల్లా ఆర్మ్‌డ్ రిజర్వ్‌లో కానిస్టేబులుగా పనిచేస్తూ విశాఖపట్నం గ్రేహౌండ్సుకు డిప్యూటేషను వెళ్లి, ప్రమాదవసాత్తు చనిపోయిన ఎఆర్ కానిస్టేబులు టి.అశోక్ కుటుంబానికి 2009 బ్యాచ్‌కు చెందిన కానిస్టేబుళ్ళు తమ వంతుగా రూ.1.65 ను జిల్లా ఎస్పీ జి.పాలరాజు చేతులు మీదుగా అశోక్ భార్య ఉషకు జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేసారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ అట్టాడ వెంకట రమణ, ఎఆర్ డిఎస్పీ ఎ.హనుమంతు, ఎస్సీ ఎస్టీ సెల్ డిఎస్పీ టి.త్రినాధ్, విజయనగరం రూరల్ సిఐ దాసరి లక్ష్మణ రావు, తదితరులు పాల్గొన్నారు.

## గిరిజనులను బెదిరిస్తే ఊరుకోము

మెంటాడ: మండలంలోని ఉద్దంగి పంచాయితీ పరిధిలో కొత్తూరు గిరిజన గ్రామాన్ని ఖాళీ చేయాలని క్వారీ కాంట్రాక్టర్ అనుచరులు తెలుగుదేశం నాయకులు బెదిరిస్తే చూస్తూ ఊరుకోమని సిపిఎం జిల్లా కార్యదరి తమ్మినేని సూర్యనారాయణ హెచ్చరించారు. కొత్తూరు గిరిజనులకు ప్రభుత్వం ప్రతి కుటుంబానికి 10 ఎకరాలు చట్టం ప్రకారం ఇవ్వాలని, 10 ఏళ్ళు గడిచిన తాగు నీరు, విద్యుత్, రోడ్డు వంతి సదుపాయాలు కల్పించకపోవడం అన్యాయమన్నారు. నివాసమున్న చోట పక్కాఇల్లు మంజూరు చేయలేదన్నారు. ఉన్న ఊరు ఖాళీ చేయాలని చెప్పడం చాలా అన్యాయమన్నారు. సుమారుగా 10 గిరిజన కుటుంబాలు కొండ, ఊట నీరు తెచ్చుకొని తాగుతున్నారని ఆవేదన వ్యక్తం చేసారు. డొంకలు తుప్పలు నరికి వడ్డు ఒరకలు బాగు చేసుకొన్న భూమిని క్వారీ కాంట్రాక్టరు ఆక్రమించిన మామిడితోట 2 ఎకరాలు ప్రభుత్వ భూమిని తిరిగి గిరిజనులు స్వాధీనం చేసుకున్నారు. సిపిఎం జెండాలు పాతా ప్రాణాలు పోయిన గ్రామాన్ని ఖాళీ చేయమని గిరిజను తెగేసి చెప్పారు. ఇల్లు పట్టాలిచ్చి మేము సాగు చేస్తున్న భూమికి పట్టాలివ్వాలిగా ప్రభుత్వ భంజరు, పోరంబోకు భూములు అప్పగించాలని కోరారు.

గిరిజనులందరూ ఐక్యంగా ఉండాలని, తేదేపా నాయకులకు ఇతర పెత్తందారులు బెదిరింపులకు లొంగి వచ్చని, సమస్యలు పరిష్కారించేవరకు పోరాడాలని కోరారు. భూముల స్వాధీన కార్యక్రమాలలో సిపిఎం మండల కార్యదర్శి రాకోటి రాములు గిరిజన సంఘ నాయకులు కొర్రి సముగు, తాండంగి దన్ను, సోడిపిల్లి సిద్ధూ, సురేష్, శివ తదితరులు పాల్గొన్నారు.


## చంద్రన్న భీమా ఓ వరం

మెంటాడ: చంద్రన్న భీమా పథకం చేరి అనారోగ్యం, ప్రమాదాలు, వివిధ కారణాల వలన చనిపోయిన వారికి చంద్రన్న భీమా ఓ వరం లాంటిదానిగా చెప్పుకో వచ్చని వైస్ఎంపిపి చలుమూరి వెంకట్రావు అన్నారు. మండల కేంద్ర మెంటాడలో గత నెల 22న చనిపోయిన పాండ్రింకి అప్పలనాయుడుకు చంద్రన్న భీమా వర్తించిందన్నారు. అప్పలనాయుడు కుటుంబ సభ్యులకు దహన సంస్కరణ కోసం అప్పుడు 5 వేలు ఇవ్వడం జరిగింది. ఇప్పుడు లక్షా 95 వేలు రూపాయలు చెక్కును ఆరోగ్యమిత్ర అలివేలు ద్వారా అందించడం జరిగింది. మెంటాడ మండలంలో 2016-17 సంవత్సరానికి గాను 22వేలు మంది చంద్రన్న భీమాపథకంలో చేరారని, జనవరి నుండి ఇప్పటి వరకు 25 మంది చనిపోయారని, వీరందరూ వివిధ కొణాల చేత మృతి చెందారని, వీరందరికి చంద్రన్న భీమా వర్తింపజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఎపిఎం స్వామి, ప్రాండ్రింకి కొండమ్మ, మాజీ వైస్ఎంపిపి కొల్లా రామలింగేశ్వర రావు తదితరులు పాల్గొన్నారు.

## ఎంపీడీవో కార్యాలయాలకు నూతన భవనాలు మంజూరు

మెంటాడ: జిల్లాలోని మెంటాడ, మెరక ముడిదాం, బాడంగి మండల పిరషత్తులకు నూతన భవనాలు మంజూరైనట్టు ఎస్ఈ.ఏ.వ. సుబ్రమణ్యం తెలిపారు. ఒక్కొక్క భవనానికి కోటి రూపాయలు చొప్పున మంజూరైనాయి. మెంటాడ భవన నిర్మాణానికి కోటి 25 లక్షలు, జామి మండల పరిషత్తు భవనం మరమ్మత్తులకు 25 లక్షలు మంజూరైనాయి. మెంటాడ మండల పరిషత్తు భవన నిర్మాణంకు రైతులు స్ధలం ఇవ్వడానికి కొంతవరకు అడ్డుతగులుతున్నారు. మండల కాంప్లెక్స్ నిర్మణా చేపడుతున్న తరుణంలో మెంటాడ గ్రామానికి చెందిన రైతులు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి కొంత స్ధలాన్ని ఇచ్చారు. విరాళంగా ఇచ్చిన స్ధలంలో కొంతమంది రైతులు ఆక్రమించి పశువుల శాలలు, ఇతరతర మొక్కలు పెంచుకుంటు వస్తున్నారు. తీరా ఆ స్ధలం ఖాళీ చేయమని భవనం నిర్మాణం జరుపుతామని సంబంధిత కాంట్రాక్టరు గత రెండు నెలలుగా రెవెన్యూ కార్యాలయ అధికార్లు చుట్టు తిరుగుతున్నారు. గతంలో రెవెన్యూ అధికారులు పశువుల శాలలను తొలగించాలని రెవెన్యూ ఎఆర్‌లు, గ్రామతలయారీలతో పాకలు తీయించే ప్రయత్నం చేసారు. మరలా రెడ్డి వచ్చి మొదలే అన్నచందంగా యదాస్ధానంలో పాకలు వేసియున్నారు. ఇలా ఉన్న తరుణంలో ఎంఆర్ఓ జి.జయదేవి, డి.టి.అప్పారావు స్పందిస్తూ ఎంపిడిఓ కార్యాలయానికి ఇచ్చిన స్ధలాలు ఆక్రమించడమేమిటి స్వయంగా తొలగించు కోవాలని, లేదంటే మేమే తొలగిస్తామని చెప్పడంతో భీష్మించి కూర్చున్న రైతులు వారికి వారే పశువుల పాకలను తొలగించే పనులో నిమగ్నమైనారు.

## ఘనంగా ఏఐటియుసి ఆవిర్భావ దినోత్సవం



నర్సీపట్నంలో ఏటిఐయుసి ఆవిర్భవ వేడుకలు జరుగుతున్న దృశ్యం

నర్సీపట్నం : అసంఘటిక రంగ కార్మికులంతా కార్మిక చట్టాల సవరణకై ఐక్యంగా పోరాడాలని నర్సీపట్నం డిపో కార్యదర్శి వివి.రావు పిలుపునిచ్చారు. మంగళవారం ఏఐటియుసి 97వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను డిపోలో నిర్వహించారు. ముందుగా కేక్ కట్ చేసి కార్మికులకు, గ్యారేజీ సెక్యూరిటీకి, సిబ్బందికి కేక్, మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత మూడు సంవత్సరాలుగా ఆశ, అంగన్వాడీ, ఆర్టీసి వర్కర్లకి యూనిఫాం విడుదల చేయలేకపోయారన్నారు. ఇన్సూరెన్స్ సదుపాయం కల్పించడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. ఎంతో మంది నాయకులు తమ జీవిత త్యాగాలుగా సాధించిన చట్టాలను కేంద్రరాష్ట్ర ప్రభుత్వాలు పెట్టుబడి దారి వర్గాలకు అనుకూలంగా సవరణ చేసారన్నారు. ఫలితంగా పక్క రాష్ట్రంలో ఇస్తున్న వేతనాలు కూడా ఇవ్వడం లేదన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాల ప్రకారం అసంఘటిత రంగంలో కనీస వేతనం 18వేలు చేయాలన్నారు. భవిష్యత్‌లో ఐక్య పోరాటాలు ద్వారా ఉద్యమాలు ఉదృతం చేయాలని ఆయన కార్మికులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రూరల్ డివిజనల్ కార్యదర్శి వై.రాము, సంఘ గౌరవ అధ్యక్షులు ఎస్‌కె.రజాక్, డిపో అధ్యక్షులు ఎ.దేముడు, అంగన్వాడీ అసోసియేషన్(ఏఐటియుసి) అధ్యక్షులు ఎం.అప్పలరాజు తదితరులు పాల్గొన్నారు.

## పరిశుభ్రతపై అవగాహన

### సిడిపిఒ ఎం.శ్రీకళ

గొలుగొండ : పరిశుభ్రంగా లేకపోతేనే అంటువ్యాధులు ప్రబలుతాయని సిడిపిఒ ఎం.శ్రీకళ సూచించారు. గొలుగొండ మండలంలోని గొలుగొండ సెక్టార్ సూపర్ వైజర్ ఐ.సత్యవతి అధ్యక్షతన మంగళవారం జరిగిన సెక్టార్ సమావేశంలో ఆమె పాల్గని ప్రసంగించారు.

మాడ్యూల్ 18 పుస్తకాన్ని అనుసరించి అంగ న్వాడీ కార్యకర్తలకు చేతులు పరిశుభ్రంగా ఉంచుకోవడం అనే అంశంపై ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వ హించారు. అంటువ్యాధులు ప్రబలకుండా ఉండాలంటే చేతులు పరిశుభ్రంగా ఉంచా లన్నారు. కార్యక్రమంలో ఏసిడిపిఒ జివి.రమణి, బిపిఎ ప్రసాద్ పాల్గొన్నారు.

## మూగజీవాల కంటైనర్ బోల్తా కేసులో ఇద్దరి అరెస్టు

కొయ్యూరు : చింతాలమ్మ ఘాట్ మలుపు వద్ద పశువులను అక్రమ రవాణా చేస్తున్న కంటైనర్ బోల్తా కొట్టిన కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్టు కొయ్యూరు ఎస్సై రుక్మాంధరరావు తెలిపారు. కంటైనర్ బోల్తా పడటంతో 16 ఆవులు దుర్మరణం చెందిన విషయం తెలిసిందే. ప్రమాద సమయంలో కంటైనర్‌లో సుమారు 60 ఆవులు ఉన్నాయి. ప్రమాదంలో 13 ఆవులు, మూడు దూడపెయ్యలు మృతి చెందగా, మిగిలిన ఆవులు కొన్ని అడవి పాలయ్యాయి. కంటైనర్ డ్రైవర్ హరియాణ రాష్ట్రం పల్వాల్‌జిల్లా మలై గ్రామానికి చెందిన కలీద్, ఓనర్ అంబర్‌పేటకు చెందిన మహమ్మద్ షఫీ కురేషిలను అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు ఎస్సై చెప్పారు.

## పివో సుడిగాలి పర్యటన

కొయ్యూరు : మండలంలోని చింతలపూడి పంచాయతీలో ఐటిడిఎ పివో పటాన్‌శెట్టి రవిప్రకాష్ సుడిగాలి పర్యటన చేశారు. పంచాయతీలోని మరుగుదొడ్లు ఏ స్థాయిలో ఉన్నాయా అనే దానిని పరిశీలించే పనిపై వచ్చినట్లు చెప్పారు. ముందుగా చింతలపూడి గ్రామంలో మహిళలతో అక్కడ సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఉపాధి హామీ బిల్లులు సక్రమంగా అందటం లేదని ఫిర్యాదు చేశారు. వెంటనే ఏపిఒ, ఎంపిడిఒను బిల్లులు చేయాలని ఆదేశించారు. అనంతరం కొత్త మరుగుదొడ్లు ఇవ్వడంతో పాటు మధ్యలో ఆగిన మరుగుదొడ్ల సంగతి ఏంటని ప్రశ్నించారు. దీనిపై వెంటనే దర్యాప్తు చేసి బిల్లులు అయ్యేలా చూస్తామన్నారు. పంచాయతీలోని ఏ ఇంటికి కూడా ఇంకుడు గుంతల సొమ్ము అందలేదని ఫిర్యాదు చేశారు. చింతలపూడిలో అంగన్వాడీ బిల్డింగ్‌ను తూతూ మంత్రంగా చేయడం బాగోలేదని గ్రామస్థులు తెలిపారు. దానిని బాగు చేయాలని ఆదేశించారు. అనంతరం గింజర్తి గ్రామంలో కూడా అక్కడి గ్రామస్థులతో పిఒ మాట్లాడారు. చింతలపూడికి పంచాయతీలో చివరి గ్రామమైన లుబ్బర్తి రహదారి అధ్వాన్నంగా ఉండటంతో అక్కడి గిరిజనులు రహదారి కోసం 10 సంవత్సరాల నుండి ఫిర్యాదు చేస్తున్నామని తెలిపారు. దీనికి వెంటనే టిఆర్‌జెఇని రహదారి పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశించారు. దీనితో లుబ్బర్తి గ్రామస్థులు ఆనందం వ్యక్తం చేశారు. ఈయనతో పాటు ఆర్‌డబ్ల్యూఎస్ జేఇ, అగ్రి కల్చర్, వెలుగు, ఎంఇఒ, ఈవోపిఆర్‌డి, పంచాయతీ సిబ్బంది, తహసీల్దార్, సాక్షరభారత్ కోఆర్డినేటర్ పాల్గొన్నారు.

## ఎన్‌టీపీసీలో ఘనంగా సర్ధార్ వల్లాభాయ్ పటేల్ జన్మదిన వేడుకలు




### ముఖ్య అతిధిగా హాజరైన ఎ.మైతి

పరవాడ: ఎన్‌టీపీసీలో మంగళవారము సర్ధార్ వల్లాబాయ్ పటేల్ జన్మదిన వేడుకులు అంగరంగ వైభముగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా జనరల్ మేనేజర్ (ఒఅండ్ ఎమ్)ఎ.మైతి హాజరు అయ్యారు.

అనంతరము ఏర్పాటు చేసిన రన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. రన్ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్క ఎన్‌టీపీసీ ఎంప్లాయికు, రోజువారు జీతనాకి పనిచేసే వారికి, సిఎస్ఎఫ్ స్కూల్ పిల్లలుకు, లేడిస్ క్లబ్ మెంబర్స్‌కు ప్రతీ ఒక్కరుకు సర్ధార్ వల్లాభాయ్ పటేల్ ముద్ర గల టీషర్టులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మైతి మాట్లాడుతూ ప్రధానంగా అవినీతి రహిత సమాజానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు.

ఈ కార్యక్రమంలో లేడిస్ క్లబ్ ప్రెసిడెంట్ మిస్సెస్ సిన్హా, సరోజని(జీఎమ్ టిఎస్), డిప్యూటీ జనరల్ మేనజర్ కె.యేసు, ఎజిఎమ్‌హెచ్‌అర్ శివప్రసాద్ మరియు అన్ని డిపార్ట్‌మెంట్‌ల్లో గల జనరల్ మేనజర్ లు తదితరులు పాల్గొన్నారు.

## సకాలంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలి

### చైర్ పర్శన్ అనిత



సర్ధార్‌వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అనిత

నర్సీపట్నం : సకాలంలో అభివృద్ధి పనులు పూర్తి చేయాలని మున్సిపల్ చైర్ పర్శన్ అనిత అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయ సమావేశ మందిరంలో మున్సిపల్ కౌన్సిల్ సమావేశం జరిగింది.

ఈ సందర్భంగా అనిత మాట్లాడుతూ మున్సిపాలిటీ అభివృద్ధి పనుల విషయంలో తీవ్ర జాప్యం చేయడం తగదన్నారు. పనులు సకాలంలో పూర్తయ్యేలా అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మున్సి పల్ వైస్ చైర్మన్ సన్యాసి పాత్రుడు(జమీలు) మాట్లాడుతూ నర్సీపట్నం మున్సిపాలిటీలో ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ కింద రూ.2.75లక్షలు మంజూరు అయ్యాయని తెలిపారు. మున్సిపాలిటీ పరిధిలో తాగునీటి అవసరాలు తీర్చడం కోసం రూ.140కోట్లతో ప్రత్యేకంగా నీటి పథకాన్ని నిర్మిస్తున్నామని, నీటి పథకం నిర్మాణ పనులు త్వరలోనే చేపడతామని చెప్పారు. నర్సీపట్నంలో యోగా, నేచురోపతి హాల్ నిర్మాణం కొరకు ఏరియా ఆసుపత్రి పక్కన స్థలాన్ని కేటాయించామన్నారు. అనంతరం రైతు రుణమాఫీ పొందిన లాలం చినఅప్పారావుకు రైతు మాఫీ పత్రాన్ని అందజేశారు. మొత్తం నర్సీపట్నంకు సంబంధించి 406 రుణమాఫీ అయినట్లు సన్యాసిపాత్రుడు తెలిపారు. అనంతరం సర్ధార్‌వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈ కార్య క్రమంలో మున్సిపల్ కమిషనర్ జె.సురేంద్ర, మున్సిపల్ కౌన్సిలర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

# పేదల ఆరోగ్యానికి రూ. 10 వేల కోట్లు

## - ఎమ్మెల్యే వాసుపల్లి




విశాఖపట్నం : పేద ప్రజల ఆరోగ్యానికి ప్రభుత్వం ఏటా రూ. 10 వేల కోట్లు ఖర్చు చేస్తుందని ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అన్నారు. విశాఖ దక్షిణం, 15, 31, 44వ వార్డులకు దొండపర్తిలో ప్రజాదర్బార్ నిర్వహించారు. ప్రజల నుంచి వినతులు స్వీకరించి సమస్యలు అడిగితెలుసుకున్నారు. వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. చంద్రన్న బీమా మీ కుటుంబానికి కాస్త ఆసరా అందిస్తుందన్నారు.

అనంతరం చంద్రన్న బీమా, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులు పంపిణీచేశారు. న్యూకాలనీకి చెందిన పిల్లా ఆదినారాయణకు, రూ. 50200 సిఎఇఆర్ఎఫ్ చెక్కును, మహమ్మద్ మక్బూల్ రూ. 20 వేల చెక్కును, శ్రీనగర్‌కు చెందిన టి. నాగజ్యోతికి రూ. 30వేల చంద్రన్నబీమా చెక్కు, లంకారాణాకి రూ. 30వేల చంద్రన్నబీమా చెక్కున అందచేశారు.

జోనల్ కమీషనర్ టి.వి. రమణమూర్తి, 15వవార్డు అధ్యక్షుడు అల్లూరి సత్యనారాయణ రెడ్డి, లక్ష్మీ శివప్రసాద్ కోటీశ్వరరెడ్డి , శంకరరావు, అక్కిరెడ్డి జగదీశ్, వీరరావు, తెలుగుదేశం నాయకులు, జన్మభూమి కమిటీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# అందుబాటులో మరుగుదొడ్లు

యానాం : స్థానిక ఫెర్రి రోడ్డులోని లక్షలాది రూపాయల వ్యయంతో నిర్మించిన మరుగుదొడ్లను ప్రజలకు అందుబాటుకు తీసుకొచ్చేలా పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు ప్రారంభించారు మంగళవారం ఉదయం ఫెర్రిరోడ్డులో సుమారు రూ. 9 లక్షల వ్యయంతో మున్సిపాలిటీ నిర్మించిన మరుగుదొడ్లను పర్యాటకులకు అందుబాటలో ఉండేలా ఏర్పాట్లు చేశారు. మంగళవారం నుండి ఇది ప్రజలకు అందుబాటులో ఉంటుందని పరిపాలనాధికారి దువులూరి సుబ్రమణ్యేశ్వరరావు, మున్సిపల్ కమీషనర్ వి. గౌరీ సరోజిని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాపనుల శాఖ ఇఇ ఎస్ శేఖరన్, ఎఇలు మేడిశెట్టి శ్రీనివాసు, ఎంవై హుసేన్, మున్సిపల్ ఉద్యోగలు, తదితరుల పాల్గొన్నారు.

## ఘనంగా సర్దార్ వల్లభాయ్‌పటేల్ జయంతి

యానాం : నేషనల్ యూనిటీ దినోత్సవాన్ని సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిగా ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఉదయం నెహ్రూ యువ కేంద్రంలో సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి వేడుకకు ముఖ్యఅతిథిగా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ఎంఎ సిరాజ్జున్ హాజరయ్యి సభ్యులందిరితో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో నవంతరం యూత్‌ప్రెసిడంట్ సత్తియ్య, ఏడుకొండలు, యువజన సంఘ సభ్యులు, మహిళామండలి సభ్యులు, నెహ్రూ యువ కేంద్రం వాలంటీర్లు ఎం వెంకటరమణ, ఆర్‌వివి సత్యానారాయణ, డి. సత్యసుధ, ఎం సత్యవతి, ఎస్ ఏసుబాబు, తదితరులు పాల్గొన్నారు.

# పేదల పక్షపాతి ఇందిరమ్మ

## నగర కాంగ్రెస్ కార్యదర్శి కె గోపాల్‌రెడ్డి




మహిళలకు చీరలు, బియ్యం పంపిణీ చేస్తున్న కె గోపాల్ రెడ్డి

విశాఖపట్నం: పేదల పక్షపాతి ఇందిరమ్మ అని నగర కాంగ్రెస్ కార్యదర్శి కె గోపాల్‌రెడ్డి అన్నారు. మాజీ ప్రధాని భారతరత్న స్వర్గీయ శ్రీమతి ఇందిరాగాంధీ వర్ధంతి సందర్భంగా 31వ వార్డులో మంగళవారం వార్డు కాంగ్రెస్ కార్యాలయంలో కె గోపాల్‌రెడ్డి మహిళలకు చీరలు, బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నా చివరి రక్తపుబొట్టు దేశ ప్రజల కోసం దారపోస్తానని అన్నమాటలు మరువలేమని ఆయన చెప్పారు. దేశ ప్రధాన మంత్రిగా గరీబ్ హఠావో నినాదంతో రాజాభరణాల రద్దు, బ్యాంకుల జాతీయకరణ చేసి పేదల పక్షపాతిగా దేశ ప్రజల హృదయాలలో చిరస్మరణీయంగా నిలిచిపోయారని అన్నారు. స్వతంత్ర పోరాటంలో వానరసేన పేరుతో ఉద్యమం చేశారని స్వతంత్రం అనంతరం దేశ అభివృద్ధికి బాటలు వేశారని, అమె ఎప్పుడూ ఈ దేశ ప్రజల కోసమే తపనపడేవారని అటువంటి మహనీయురాలి వర్ధంతి సందర్భంగా నేడు ఈ సేవా కార్యక్రమం నిర్వహించామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో మహిళా నాయకురాలు రవణమ్మ, గీత, స్థానిక నాయకులు, కాంగ్రెస్ అభిమానులు పాల్గొన్నారు.

# అభివృద్ధి పనులకు రూ 6.20 కోట్లు

## - మంత్రి మల్లాడి

యానాం : యానాంలో వివిధ అభివృద్ధి పనులకు రూ. 6.20 కోట్లు నిధులు ప్రభుత్వ విడుదల చేసినట్లు పుదుచ్చేరి ఆరోగ్యశాఖ మంత్రి మల్లాడి క్రిష్ణారావు తెలిపారు. మంగళవారం సాయంత్రం మంత్రి క్యాంపు కార్యాలయంలో అయన విలేఖరులతో మాట్లాడారు. స్థానిక ఓల్గ్ రాజీవ్ నగర్‌లో టైటిల్‌లాక్ సమీపంలో రూ. 6.20 కోట్లతో రోడ్లు విస్తరణపనులు, విద్యుత్ దీపాల ఏర్పాట్లు, రివెట్‌మెంట్ పనులకు ఈ నిధులు విడుదల అయ్యాయన్నారు. యానాంలో తాను ప్రతిష్టాత్మాకంగా తీసుకున్న ఆసుపత్రి జిప్‌మేర్ బ్రాంచ్ కార్యాలయం, జిఎన్ఎం పనులకు ప్రభుత్వం నిధులు విడుదలకు అంగీకరించిందన్నారు. ఆయూష్ ఆసుపత్రి, జిఎన్ఎంలకు ప్రభుత్వం జివో విడుదలచేసిందన్నారు. జిప్‌మేర్ బ్రాంచి కార్యాలయంలో 90 శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు. పుదుచ్చేరి ప్రభుత్వం ఆర్ధికంగా సంక్షోభంలో ఉన్నప్పటికీ కేంద్రం సహకారంతో టిఆర్ఎఫ్ నిధులు రూ. 2.20 నిధులు తీసుకొచ్చానన్నారు. ఇందులో కోటీ 35 లక్షల రూపాయలు అయ్యన్ననగర్ నుండి కురుసం పేట, నీళ్లపల్లి ప్రధాన డ్రైనేజ్‌ల నిర్మాణానికి ఈ నిధులు కేటాయించామన్నారు. 14200 మంది టిబి వ్యాధిగ్రస్తులకు డోస్ తగ్గించి ప్రతిరోజు మందులు నెలకు ఇస్తారన్నారు. తాను వారంలో నాల్గు రోజులు పుదుచ్చేరిలో ఉంటున్నానని మిగిలిన రోజులు యానాంలో గడుపుతున్నానన్నారు. ప్రజల యొక్క కష్టాలు తెలుసుకుని క్యాంపు కార్యాలయం ద్వారా అన్ని పనులు పూర్తిచేస్తున్నానన్నారు. చౌక డిపోల ద్వారా ఇచ్చే బియ్యాని ప్రభుత్వం జోన్‌లవారిగా విభజించిందని అందరికి బియ్యం అందుతాయన్నారు.

# బాలయ్యను మర్యాద పూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే వాసుపల్లి




విశాఖపట్నం : సినీనటుడు, ఎమ్మెల్యే బాలకృష్ణను దక్షిణ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ 104లోని షూటింగ్ స్పాట్‌కు వెళ్ల మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. విశాఖలో షూటింగ్ జరిగిన బాలయ్య సినిమాలన్నీ అఖండ విజయాలు సాధించాయని జయసింహ సినిమా ఘన విజయం సాధిస్తుందని ఆకాంక్షను వ్యక్తంచేశారు. అనంతరం విశాఖ అభివృద్ధి గురించి మాట్లాడుకున్నారు. విశాఖ అంతర్జాతీయ నగరంగా తీర్చిదిద్దడంలో ప్రభుత్వం సంకల్పాన్ని ప్రస్తుతించారు. ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమం విశాఖలో విజయవంతం కావడం, పార్టీ బలోపేతం తదితర అంశాలపై చర్చించారు.

# రామానుజ గణితపోటీ విజేతలు వీరే

యానాం : జాతీయ స్థాయిలో నిర్వహించిన రామానుజ గణిత పోటీల్లో ప్రథమస్థాయిలో జరిగిన విజేతల వివరాలను రామానుజ గణిత జిల్లా ఉపాధ్యాక్షులు అనాల వీరభద్రరావు వెల్లడించారు. 4వ తరగతి విభాగంలో కాపుల పాలెం స్కూల్‌కు చెందిన ఎం శ్రీఅఖిల ప్రథమ, ఎన్‌ఆర్‌టిఎస్ స్కూల్‌కు చెందిన వి. మనోహరణి ద్వితియ, 5వ తరగతి విభాగంలో కాపులపాలెం స్కూల్‌కు చెందిన ఎన్. అస్మిత ప్రథమ, శారదా విద్యానికేతన్‌కు చెందిన పి.పేరిరాజు ద్వితియ, 6వ తరగతి విభగంలో సొల్లంగి స్కూల్‌కు చెందిన వి అశిరాదేవి ప్రథమ, డిఎం విష్ణా ద్వితియ, 7వ తరగతి విభాగంలో కనకాల పేట స్కూల్‌కు చెందిన పి. శ్రీమణి ప్రథమ, పరంపేట స్కూల్‌కు చెందిన పి. భవాని ద్వితియ, 8వ తరగతి విభాగంలో కాపులపాలెం స్కూల్‌కు చెందిన సి. రాజరాజేశ్వరి సాయిప్రణీత ప్రథమ, సొల్లంగి స్కూల్‌కు చెందిన వై మనీషా ద్వితియ, 9వ తరగతి విభాగంలో రాజీవ్‌గాంధీ ఇంగ్లీష్ మీడియం స్కూల్‌కు చెందిన ఆర్ హారిక, ప్రథమ, కాపులపాలెం స్కూల్‌కు చెందిన జి సాయి మణికంఠ ద్వితియ, 10వ తరగతి విభాగంలో కాపులపాలెం స్కూల్‌కు చెందిన ఎంవైవిఎస్‌డి మణి ప్రథమ, యానాం పబ్లిక్ స్కూల్‌కు చెందిన పి. లక్ష్మీ ద్వితియ స్థానాలు గెలుచుకున్నారన్నారు.

# ఘనంగా సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదిన వేడుకలు



రావులపాలెం : దేశం కోసం తన జీవితాన్నే త్యాగం చేసిన మహా మనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్ అని బిజెపి జిల్లా అధ్యక్షులు ఎనిమిరెడ్డి మాల కొండయ్య అన్నారు. మంగళవారం స్థానిక బిజెపి కార్యాలయంలో బిజెపి మండల ఉపాధ్యక్షులు గంధ్రోతు వీర గోవిందరావు అధ్యక్షతన జరిగిన సమావేశంలో ముఖ్య అతిథిగా ఎనిమిరెడ్డి మాల కొండయ్య, జిల్లా కార్యవర్గ సభ్యులు కంకటాల వెంకటరత్నం (నాని) పాల్గొని సర్దార్ వల్లభాయ్ పటేల్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ముందుగా పటేల్ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భముగా వారు మాట్లాడుతూ 560 సంస్థానాలను భారతదేశంలో విలీనం చేసిన ఘనుడు పటేల్ అని అన్నారు. అనంతరం బిజెపి చేస్తున్న అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై పార్టీలో జాయిన్ అయినారు. వీరిని కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించాంచారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యులు పాలూరి సత్యానందం, జిల్లా యువమోర్చా ఉపాధ్యక్షులు పాలూరి జయ ప్రకాష్ నారాయణ, గోనెమడతల కనకరాజు, జనిపిరెడ్డి తాతారావు, గంధం వీరభద్రం, మహిళా మోర్చా అధ్యక్షురాలు తలారి లలిత, నందం లక్ష్మి, సీతారామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# నేడు ఎవరెస్ట్ అధిరోహానికి ఉత్సాహుల నుండి ఆహ్వానం

రావులపాలెం: మౌంట్ ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించుటకు ఔత్సాహికులైన యువతీ యువకుల నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రావులపాలెం ఎమ్‌పిడిఓ వై ఉమా మహేశ్వరరావు తెలిపారు. జిల్లా యువజన సంక్షేమ శాఖ సెట్రాజ్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన ఈ ఎన్‌రోల్‌మెంటు కార్యక్రమానికి వయస్సు 35లోపు ఉన్న యువతీ యువకులు, ఎపికి సంబందించిన వారై, సంవత్సరాదాయం 81 వేలకు లోపు ఉండి, డిగ్రీ ఉత్తీర్ణత సాధించి, ఇంగ్లిష్, హింది మాట్లాడడంలో ప్రావీణ్యతలు కలిగి ఉండాలన్నారు. ఎంపిక ప్రక్రియ జిల్లా స్పోర్ట్స్ స్టేడియం కాకినాడలో జరుగునని, ఆసక్తి గలవారు రెండు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో, సంబందిత పత్రాలతో కాకినాడలో హాజరుకావచ్చని తెలిపారు

# ఘనంగా వల్లభాయి పటేల్ 140వ జయంతోత్సవం

ఆలమూరు : స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలు మేరకు మంగళవారం జాతీయ ఐక్యమత్య దినోత్సవం సందర్భంగా ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయిపటేల్ 140వ జయంతోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వల్లభాయిపటేల్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఈ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు ప్రతిజ్ఞ చేసారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ కె.పద్మావతి, డిప్యూటీ తహశీల్దార్ పి.వి.ఎస్.ఆర్.కృష్ణమూర్తి, సీనియర్ అసిస్టెంట్ ప్రసాదరావు, ఆర్.ఐ. సయ్యద్ హుస్సేన్, జూ.అ. యమున, విఆర్వోలు జి.సత్యనారాయణ, టి.అబ్బులు తదితరులు పాల్గొన్నారు..

# రోడ్డు పొడువునా మొక్కలునాటాలి

తాళ్లరేవు : 216 జాతీయ రహదారి వెంబడి దారిపొడువునా మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రభుత్వం చేపట్టాలని వైఎస్ఆర్ సిపి మండల కన్వీనర్ టిల్లపూడి నాగేశ్వరరావు డిమాండ్ చేశారు. 216 జాతీయ రహదారి రోడ్డు విస్తరణ పనుల నిమిత్తం తాళ్లరేవు నుండి సొల్లంగి వరకు ఉన్న భారీ చెట్టను కూకటివేళ్లతో పెకలించి సుమారు 8 నెలలు కావస్తున్నా ఆర్ అండ్ బి అధికారులు ఇప్పటి వరకు మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టకపోవడం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయన్నారు. దారి పొడువునా మొక్కలు లేకపోవడవలన ప్రయాణికులకు నిలవ నీడ లేకుండా పోయిందన్నారు. గతంలో రొడ్డు వెంబడి ప్రయాణించేటప్పుడు చెట్లు వుండటం వలన ఎంతో అహ్లాదంగా ఉండేదని నేడు ఆ పరిస్థితులు కనపడట లేదన్నారు. రోడ్డు పనులమీద అధికారులకు మక్కువ కనిపిస్తుందని మొక్కలు నాటే అలోచన కనపడటం లేదని దీని వలన పర్యావరణానికి తీవ్ర విఘాతం ఏర్పడుతుందన్నారు. ప్రస్తుత సీజన్‌లో మొక్కలు నాటకపోతే మరలా జూలై వచ్చేవరకు మొక్కలు నాటే పరిస్థితులు ఉండవని ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు దృష్టిపెట్టి మొక్కలు నాటేలా చర్యలు చేపట్టాలన్నారు. వారం రోజులోగా మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టకపోతే అందోళనకు సిద్ధం అవుతామన్నారు.

# అన్నివిధాల రాష్ట్రాభివృద్ధే టిడిపి ప్రభుత్వ లక్ష్యం

ఆలమూరు : అన్ని విధాలా రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపించడమే టిడిపి ప్రభుత్వ లక్ష్యమని కొత్తపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి మాజీ ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. మండల కేంద్రం ఆలమూరు గ్రామంలో గ్రామ టిడిపి అధ్యక్షుడు కడియాల శ్రీనివాసు ఆధ్వర్యంలో మంగళవారం ఇంటింటకీ తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా పాల్గొన్న బండారు సత్యానందరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలసి గ్రామంలో ఇంటింటికీ తిరిగి సమస్యలను అడిగి తెలుసుకుని ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలను, అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. తొలుత ఆయన గ్రామంలో బస్టాండు వద్ద ఎన్‌టిఆర్ విగ్రహానికి పూల మాలలు వేసి పార్టీ జెండాను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఎఎమ్‌సి ఛైర్మన్ ఈదల సత్యనారాయణ చౌదరి, ఎంపిపి కొత్తపల్లి ధనలక్ష్మి, మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు సిద్దిరెడ్డి పెద్దకాపు, రాయుడు సూరిబాబు, ఎంపిటిసి అనుసూరి నాగరత్నం, సొసైటీ అధ్యక్షులు వంటిపల్లి సతీష్, మాజీ జెడ్‌పిటిసి రామానుజుల శేషగిరిరావు, ఈదల రాంబాబు, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

# ఉక్కుమనిషి సర్దార్ వల్లభాయ్ పటేల్



అమలాపురం : అమలాపురం పట్టణం సుభాష్‌చంద్రబోష్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల నందు సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని యువమోర్చా జిల్లా కార్యదర్శి గనిశెట్టి అరవింద్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి.రామకృష్ణ అధ్యక్షతన జరిగిన సమావేశానికి బిజెపి జిల్లా ప్రధాన కార్యదరి౦శ నల్లా పవన్‌కుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. స్వాతంత్ర్యోద్యమంలో బ్రిటీష్ పాలకులను గడగడలాడించిన ఉక్కుమనిషి సర్ధార్ వల్లభాయ్ పటేల్ అని అన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ముఖ్యభూమిక పోషించారని అన్నారు. అంతేకాకుండా సహాయ నిరాకరణ ఉద్యమం, ఉప్పు సత్యాగ్రహం, క్విట్ ఇండియా ఉద్యమాలకు గుజరాత్‌లో పిలుపునివ్వడమే కాకుండా ముందుండి నడిపించి స్వాతంత్ర్యం తీసుకువచ్చిన ఘనుడని కొనియాడారు. స్వాతంత్ర్యం అనంతరం భారతదేశానికి తొలి ఉప ప్రధానిగా దేశానికి ఎన్నో సేవలందించారని అన్నారు. స్వాతంత్ర్యం అనంతరం 500కు పైగా సంస్థానాలు ఉండేవని, వాటన్నింటిని ఏకం చేసి ఏకీకృత భారతదేశ నిర్మాణ యోగ్యుడని కొనియాడారు. పిల్లలనుద్దేశించి భారతదేశ గొప్పదనం, స్వాతంత్ర్య పోరాటం, స్వాతంత్ర్య పోరాట యోధుల చరిత్ర కోసం తెలియజేసారు. తొలుత సర్ధార్ వల్లభాయ్ పటేల్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులకు, సిబ్బంది మిఠాయిలు, పండ్లు పంపిణీ చేసారు.

ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి గోకరకొండ గంగన్నస్వామి, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దేశినీడి కిరణ్, జిల్లా మానవ హక్కుల సంఘం కన్వీనర్ ఈతకోట బాలస్వామి, బిజెపి జిల్లా కార్యవర్గ సభ్యులు అరిగెల నాని, యువమోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు కాశిన ఫణేంద్ర, పట్టణ ఉపాధ్యక్షులు కాటా బాలయ్య, పట్టణ కోశాధికారి సలాది నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 31 వ కార్తీక వన మహొత్సవం



రావులపాలెం : కోనసీమ ముఖద్వారం రావులపాలెం కార్తీక మాసాన్ని పురస్కరించుకొని మంగళవారం పోతంశెట్టి కనికిరెడ్డి టిండర్ డిపో ఆవరణలో ఘనంగా కార్తీక వన భోజన మహొత్సవం నిర్వహించారు. పోతంశెట్టి కనికిరెడ్డి, పడాల రామకృష్ణారెడ్డిల ఆధ్వర్యంలో జరిగిన ఈ వన మహొత్సవ సమారాధనకు భాస్కర హొటల్ సత్యనారాయణరెడ్డి దంపతులతో లక్ష్మీనారాయణ స్వామికి పూజలు నిర్వహించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వివిధ రంగాలలో సేవలందించిన నిష్ణాతులైన ప్రముఖులను ఘనంగా సత్కరించి, బహుమతులు అందజేసారు. సిఆర్‌సి ద్వారా సామాజిక సేవ చేస్తున్న మల్లిడి కనికిరెడ్డి, అంతర్జాతీయ శిల్పిగా పేరుగాంచిన డి. రాజ్‌కుమార్ వుడయార్, ఆర్.ఎమ్.పి. డాక్టరుగా ఉత్తమ సేవలందిస్తున్న బళ్ల తాతారావు, విద్యారంగంలో సేవలందిస్తున్న కె. వీరభద్రరావు, సత్యసాయి సేవా సంస్థలో వికలాంగులకు సేవలందిస్తున్న కుమారి సుంకర రమాదేవిలు ఉన్నారు. కార్తీక వనమహొత్సవానికి వేలాది మందిగా తరలి వచ్చారు. ఈ సందర్భముగా రావులపాలెం భజనమండలి వారిచే ఆలపించిన భక్తి గీతాలు పలువురిని మంత్ర ముగ్దుల్ని చేసాయి. ఈ కార్యక్రమంలో సోమయాజులు మాస్టారు కార్తీక మాసం విశిష్ఠత, కార్తీక మాసంలో ఆచరించవలసిన నియమాలు, నిష్టలు, ఉపవాసాలు ఏవిధంగా చేస్తే ఫలితాలు వస్తాయో కన్నులకు కట్టినట్లుగా వివరించారు. కార్తీక మాసంలో నిర్వహించే వన సమారాధనలు వల్ల ఆధ్యాత్మిక చింతనతోపాటు, ఆనందం, ఆరోగ్యం పెంపొందుతాయని, కుటుంబ సమేతంగా స్వీకరించే ఈ భోజనం సాంప్రదాయానికి ప్రతీకగా నిలుస్తుందని నిర్వాహకులు పోతంశెట్టి కనికిరెడ్డి, పడాల రామకృష్ణారెడ్డిలు అన్నారు. ఈ కార్యక్రమంలో డి.సి.ఎమ్.ఎస్. ఛైర్మన్ కె.వి. సత్యనారాయణరెడ్డి, సిఆర్‌సి కార్యదర్శి కర్రి అశోక్ రెడ్డి, ఛాంబర్ అధ్యక్షులు కర్రి సుబ్బారెడ్డి, యోగాచార్య కర్రి సత్యనారాయణరెడ్డి (సత్తిరెడ్డి), శ్రీనివాసరెడ్డి, మన్యం పర్వత వర్ధనరావు, మన్యం సుబ్రహ్మణ్యేశ్వరరావు, మల్లిడి కనికిరెడ్డి, కుడుపూడి శ్రీనివాస్, మంతెన రవిరాజు, నాగభూషణం మాస్టారు, ఆర్.కె. రెడ్డి, సర్పంచ్ పోతుమూడి విజయలక్ష్మి, ఉప సర్పంచ్ కొవ్వూరి జగన్నాధరెడ్డి, దుళ్ళ వెంకటేశ్వరరావు, ఎస్సై సిహెచ్ విద్యా సాగర్ ప్రజా ప్రతినిధులు, వేలాది మంది ప్రజలు తదితరులు పాల్గొన్నారు.


# ఇక ఆపేయండి!

## చిత్రభాను

నితిన్ కథానాయకుడిగా నటించిన లై చిత్రం ద్వారా తెలుగు చిత్రసీమలోకి అరంగేట్రం చేసింది తమిళమ్మాయి మేఘా ఆకాష్. ఈ సినిమాలో ఈ జంట కెమిస్ట్రీ బాగా కుదిరిందని ప్రశంసలొచ్చాయి. నితిన్ తాజా చిత్రంలో కూడా ఈ అమ్మడే కథానాయికగా నటిస్తున్నది. దీంతో వీరిద్దరి మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తున్నదని సినీ వర్గాల్లో గుసగుసలు వినిపించాయి. నితిన్ సినిమా కోసం మేఘా ఆకాష్ ఓ తమిళ సినిమాను కూడా వదులుకుందని వినిపించింది. ఈ విషయం గురించి క్లారిటీ ఇచ్చింది మేఘా ఆకాష్. నితిన్‌తో నేను ప్రేమలో వున్నానని మీడియాలో వస్తున్న వార్తల్లో ఏమాత్రం నిజం లేదు. ఇద్దరం కలిసి వరుసగా రెండు సినిమాలు చేయడం వల్ల మాపై గాసిప్స్ స ృష్టించారు. మంచి ప్రాజెక్ట్ కావడంతో నితిన్ సినిమా కోసం డేట్స్ సర్దుబాటు చేసుకున్నాను. నితిన్ నాకు ఆత్మీయ మిత్రుడు. ఇకనైనా ఇలాంటి అసత్య వార్తల్ని ఆపేయండి అని వివరణ ఇచ్చింది. నితిన్-మేఘాఆకాష్ నటిస్తున్న తాజా చిత్రానికి క ృష?చైతన్య దర్శకత్వం వహిస్తున్నారు. త్రివిక్రమ్-సుధాకర్‌రెడ్డి సంయుక్తంగా నిర్మిస్తున్నారు.



## తండ్రి పాత్రలో తనయుడు!



ఎన్టీఆర్ జీవిత కథ ఆధారంగా ఓ చిత్రం త్వరలో సెట్స్‌పైకి రానున్న విషయం తెలిసిందే. ఎన్టీఆర్ పాత్రలో బాలక ృష? నటించనున్న ఈ చిత్రానికి తేజ దర్శకత్వం వహించనున్నారు. సాయి కొర్రపాటి, విషు? ఇందూరితో కలిసి బాలక ృష? ఈ చిత్రాన్ని నిర్మించడానికి సన్నాహాలు చేస్తున్నారు. ప్రస్తుతం స్క్రిప్ట్ వర్క్ తుది దశకు చేరుకున్న ఈ చిత్రంలో ఎన్టీఆర్ తనయుడిగా చైతన్యరథానికి సారథ్యం వహించిన హరిక ృష? పాత్రలో నందమూరి కల్యాణ్‌రామ్ కనిపించనున్నట్లు తెలిసింది. 1983 ఎన్నికల సమయంలో అవిభాజ్య ఆంధ్రప్రదేశ్ అంతటా ఎన్టీఆర్ పర్యటించిన విషయం తెలిసిందే. ఆ సమయంలో చైతన్యరథం బాధ్యతల్ని హరిక ృష? నిర్వహించారు. ఇప్పుడు ఆయన పాత్రలో కల్యాణ్‌రామ్ అయితేనే బాగుంటుందని దర్శకుడు తేజ భావించి ఆయనను ఖరారు చేసినట్లు సమాచారం. ఎన్టీఆర్ పేరుతో తెరకెక్కనున్న ఈ చిత్రం ఫిబ్రవరి నుంచి లాంఛనంగా ప్రారంభం కానుంది.

## ప్రణయ పథంలో..



ఫిదా చిత్రం ద్వారా కెరీర్‌లోనే అతిపెద్ద సక్సెస్‌ను సొంతం చేసుకున్నారు వరుణ్‌తేజ్. తాజాగా ఆయన కథానాయకుడిగా శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర ఎల్.ఎల్.పి పతాకంపై ఓ చిత్రం రూపొందుతున్నది. బి.వి.ఎస్.ఎన్ ప్రసాద్ నిర్మాత. వెంకీ అట్లూరి దర్శకుడిగా పరిచయమవుతున్నారు. రాశిఖన్నా కథానాయిక. వచ్చే ఏడాది ఫిబ్రవరి 9న ఈ చిత్రం విడుదలకానున్నది. నిర్మాత చిత్ర విశేషాల్ని తెలియజేస్తూ ఓ జంట ప్రేమపయనానికి అందమైన దృశ్యరూపమే ఈ చిత్రం. లవ్ ఎంటర్‌టైనర్‌గా తెరకెక్కుతున్న ఈ చిత్రంలో వరుణ్‌తేజ్ పాత్ర నవ్యపంథాలో సాగుతుంది. అతడి కెరీర్‌లో మరో వైవిధ్యమైన చిత్రంగా నిలుస్తుంది. వరుణ్‌తేజ్, రాశిఖన్నా కెమిస్ట్రీ అలరిస్తుంది. సరికొత్త ప్రేమకథగా దర్శకుడు ఈ చిత్రాన్ని తీర్చిదిద్దుతున్నారు.

ఇటీవల లండన్‌లో నలభై రోజుల పాటు ఏకధాటిగా చిత్రీకరణ జరిపాం. ఈ షెడ్యూల్‌తో 70 శాతం చిత్రీకరణ పూర్తయింది. డిసెంబర్‌లోగా షూటింగ్ పూర్తిచేస్తాం. తమన్ బాణీలు, జార్జ్.సి. విలియమ్స్ ఛాయాగ్రహణం సినిమాకు ప్రధాన బలంగా నిలుస్తాయి అని తెలిపారు.

## కన్నీటి వలస దృశ్యం



ఉపాధికోసం ఎడారి దేశాలకు వలస వెళ్లిన ప్రవాస భారతీయుల జీవితాల్ని, వారి కన్నీళ్లను కళ్లకు కట్టినట్లుగా ఆవిష్కరిస్తూ సామాజిక స్ప ృహతో దర్శకుడు సునీల్‌కుమార్‌రెడ్డి తెరకెక్కించిన గల్ఫ్ చిత్రం ఇటీవలే ప్రేక్షకులముందుకొచ్చింది. కార్మికుల వ్యథలను మానవీయ కోణంలో వెండితెరపై ద ృశ్యమానం చేసిన చిత్రమిది. వలస కార్మికుల జీవితాలపై విస్తృత పరిశోధన చేసి, ప్రత్యక్షంగా వారి సమస్యలను తెలుసుకొని మనసుల్ని హత్తుకునేలా సునీల్‌కుమార్‌రెడ్డి ఈ సినిమాను రూపొందించారు. సందేశాత్మక కథాంశానికి కమర్షియల్ హంగులను అద్ది రూపొందించిన ఈ చిత్రం విమర్శకుల ప్రశంసలను అందుకుంటున్నది. తెలంగాణలోని సిరిసిల్ల చేనేత కార్మిక కుటుంబానికి చెందిన శివ అనే యువకుడు, ఆంధ్రా ప్రాంతానికి చెందిన లక్ష్మీ అనే అమ్మాయి ఉపాధి కోసం గల్ఫ్‌కు వెళతారు. ప్రయాణంలో వారిద్దరి మధ్య మొదలైన పరిచయం కొద్ది రోజుల్లోనే ప్రణయంగా మారుతుంది. కోటి ఆశలతో గల్ఫ్‌లో అడుగుపెట్టిన వారి జీవితాలు కొద్ది రోజుల్లోనే కల్లలవుతాయి. ఎడారి దేశంలో ఎన్నో వ్యయప్రయాసల్ని ఎదుర్కొంటారు. ఆ కష్టాలకడలి నుంచి బయటపడేందుకు ఆ జంట ఎలాంటి ప్రయత్నాలు చేశారన్నదే ఈ చిత్ర ఇతివ ృత్తం. ఓ జంట ప్రేమకథ ద్వారా గల్ఫ్ వ్యథలను సినిమాలో హ ృద్యంగా చూపించారు సునీల్‌కుమార్‌రెడ్డి. సినిమాటిక్ ఫీల్ కాకుండా నిజజీవితాల్ని చూస్తున్న అనుభూతిని పంచిందీ చిత్రం. పులగం చిన్నారాయణ సంభాషణలు అర్థవంతంగా సాగుతూ హ ృదయాల్ని స్ప ృశించాయి.డబ్బు సంపాదన కోసం గల్ఫ్‌లో అడుగుపెడుతున్న భారతీయులు ఏ విధంగా శ్రమ దోపిడికి గురవుతున్నారు? అక్కడ బానిసలుగా మారి ఎన్ని కష్టాలను అనుభవిస్తున్నారు? దళారుల మోసాలు, అరబ్బుల దాష్టికాల వల్ల ఎలాంటి హింసలకు గురవుతున్నారనే అంశాలను యదార్థ కోణంలో చూపించారు. కుటుంబాలకు దూరమై భారతీయులు ఎదుర్కొంటున్న సంఘర్షణను, తమ వారి రాక కోసం కన్నీళ్లతో ఎదురుచూస్తున్న కన్నవారి బాధను ప్రధాన పాత్రల ద్వారా ఆవిష్కరించిన విధానం ప్రతి ఒక్కరి హ ృదయాన్ని కదిలిస్తుంది. ఈ సినిమా గురించి సునీల్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ గల్ఫ్ సమస్యలపై ప్రజల్లో కొంతైనా మార్పు తీసుకురావాలనే ఉద్దేశ్యంతో చేసిన చిత్రమిది. మా ప్రయత్నంలో సఫలీక ృతమయ్యామని అనుకుంటున్నాం అని తెలిపారు.



## ప్రేమ మాయలో పడితే..

అరుణ్‌గుప్తా, సావేరి, జయవర్ధన్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న చిత్రం పడిపోయా నీ మాయలో. ఆర్.కె. కాంపల్లి దర్శకత్వం వహించారు. మహేష్ పైడ, భరత్ అంకతి నిర్మించారు. ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌తో పాటు టీజర్‌ను చిత్రబ ృందం ఆదివారం హైదరాబాద్‌లో విడుదలచేసింది. ఈ సందర్భంగా నిర్మాతలు మాట్లాడుతూ తొలిప్రేమ తాలూకు మధుర భావనలకు అందమైన ద ృశ్యరూపంగా నిలిచే చిత్రమిది. వినోదానికి పెద్దపీట వేస్తూ రూపొందించాం. వరంగల్, ఖమ్మం, వైజాగ్‌లలో ప్రధాన ఘట్టాలను చిత్రీకరించాం. నటీనటులు కొత్తవారైనా అనుభవజ్ఞుల్లా అదుతేమైన అభినయాన్ని కనబరిచారు అని చెప్పారు. దర్శకుడు మాట్లాడుతూ పూరి జగన్నాథ్‌కు నేను వీరాభిమానిని. ఆయన శైలిలోనే ఈ సినిమా చేశాను అని తెలిపారు. వినోదాన్ని నమ్మి తాము చేస్తున్న ఈ ప్రయత్నం తెలుగు ప్రేక్షకుల్ని మెప్పిస్తుందనే నమ్మకముందని హీరో అరుణ్ గుప్తా చెప్పారు.

# మరో స్టార్ హీరో పొలిటికల్ పార్టీ



సినిమా తారలంతా రాజకీయాల్లోకి రావటానికి తహ తహలాడుతున్నారు ఇప్పటికే తమిళ నాట రజినీకాంత్, కమల హాసన్ ఇదే ప్రయత్నాల్లో ఉన్నారు. కమల్ ఇప్పటికే సొంత పార్టీ అనే నిర?యం లో ఉండగా రజినీకాంత్ ఇంకా ఏ నిర్ణయమూ తేల్చనే లేదు.. ఇక మనదగ్గర పవన్ చురుకుగా పావులు కదుపుతూనే ఉన్నాడు. వీళ్ళంతా ఎవరి హడావిడిలో వాళ్ళుండగానే గప్ చిప్ గా తన పార్టీ ని ప్రకటించేసాదు కన్నడ హీరో ఉపేంద్ర. విలక్షణ నటనతో తెలుగు ప్రేక్షకుల్లోనూ మంచి ఆదరణ ఉన్న కన్నడ స్టార్ హీరో ఉపేంద్ర రాజకీయ రంగప్రవేశం చేశారు. 'కరా?టక ప్రజ్ఞావంత జనతాపక్ష పార్టీ' పేరుతో రాజకీయ పార్టీని ప్రకటించారు. పార్టీ లోగోను కూడా ఆవిష్కరించి సిద్ధాంతాలను కూడా ప్రకటించారు. పార్టీ సిద్ధాంతాలను మీడియాకు వివరించారు. ఈ కార్యక్రమానికి బెంగళూరులోని గాంధీభవన్ వేదికైంది.రాజకీయరంగంలో డబ్బు ప్రభావం బాగా పెరిగిపోయిందని.. దాన్ని అంతం చేసేందుకు శాయశక్తులా పోరాటం చేస్తామని ఉపేంద్ర ఈ సందర్భంగా హామీ ఇచ్చారు. ప్రజాప్రతినిధులు ఉన్నత విద్యావంతులై ఉంటేనే మంచిదని అభిప్రాయపడ్డారు. రైతుల, విద్యార్థుల సమస్యలను పరిష్కరించడానికి క ృషి చేస్తామని తెలిపారు. పేద ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యంగా తమ పార్టీ పనిచేస్తుందని ఉపేంద్ర పేర్కొన్నారు. పేద ప్రజలకు సేవ చేయడమే తన లక్ష్యం, పార్టీ లక్ష్యమని ఈ సందర్భంగా ఉపేంద్ర పేర్కొన్నారు. ఇది తన పార్టీ కాదని, ప్రజల పార్టీ అని తెలిపారు. ప్రజల కోసం తాను ఒక వేదికను మాత్రమే సిద్ధం చేశానని... తన లక్ష్యాలతో ఏకీభవించేవారంతా పార్టీలో భాగస్వాములు కావచ్చని, సమాజంలో మార్పును తీసుకురావడమే తన కల అని చెప్పారు.

ఉపేంద్ర అభిమానులు భారీ ఎత్తున తరలివచ్చారు. ఈ సందర్భంగా అందరూ ఖాకీ షర్టులను ధరించారు.

రాజకీయరంగంలో డబ్బు ప్రభావం బాగా పెరిగిపోయిందని... దాన్ని అంతం చేయడానికి శాయశక్తులా పోరాటం చేస్తామని చెప్పిన ఉపేంద్ర. ప్రజాప్రతినిధులు ఉన్నత విద్యావంతులై ఉంటేనే మంచిదని అభిప్రాయపడ్డారు.ఈ కార్యక్రమానికి ఉపేంద్ర భార్య ప్రియాంక కూడా హాజరయ్యారు.

# ఆడాలి.. గెలవాలి.. అదే నా లక్ష్యం



హైదరాబాద్ : వరసగా 2 సూపర్ సిరీస్ టైటిళ్లు సాధించి స్వదేశం చేరుకున్న స్టార్ షట్లర్, తెలుగు తేజం కిదాంబి శ్రీకాంత్కు అభిమానులు బ్రహ్మరథం పట్టారు. మంగళవారం (అక్టోబర్ 31) ఉదయం శంషాబాద్ ఎయిర్పోర్టుకు చేరుకున్న శ్రీకాంత్కు ఘన స్వాగతం లభించింది. అభిమానులు పుష్పగుచ్ఛాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కిదాంబి మాట్లాడుతూ.. వరసగా 2 సూపర్ సిరీస్ టై%టిళ్లు గెలవడం ఎంతో సంతోషంగా ఉందని తెలిపాడు. నా విజయాల వెనుక కోచ్ పుల్లెల గోపిచంద్ కృషి ఎంతో ఉంది. నేను ఆడిన రెండు సిరీస్‌లు చాలా కఠినమైనవి. అత్యుత్తమ ఆటగాళ్లతో తలపడి గెలవడం సంతృప్తినిచ్చింది. ప్రత్యర్థులపై ఆధిపత్యం కనబరచడం సంతోషంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని టోర్నీలు గెలవడానికి ప్రయత్నిస్తా అని శ్రీకాంత్ అన్నాడు. ఒకే ఏడాదిలో 4 సూపర్ సిరీస్ టై%టిళ్లు గెలిచిన శ్రీకాంత్.. భారత సత్తా చాటాడు. ఈ ఏడాది అతడు ఇండోనేషియా ఓపెన్, ఆస్ట్రేలియా ఓపెన్, డెన్మార్క్ ఓపెన్ సహా ఫ్రెంచ్ ఓపెన్ గెలుచుకొని.. ప్రపంచ దిగ్గజ ఆటగాళ్లు లీ చాంగ్ వీ, లిన్ డాన్, చెన్ లాంగ్ సరసన నిలిచాడు. ఈ నేపథ్యంలో నంబర్ వన్ ర్యాంకు గురించి ప్రశ్నించగా.. నం.1 కావాలని ఎవరికైనా ఉంటుంది. అయితే ఇప్పటి వరకు నేను ర్యాంకుల గురించి ఆలోచించలేదు. ప్రస్తుతం.. ఆడాలి, గెలవాలి అన్నదే నా లక్ష్యం. డెన్మార్క్ ఓపెన్, ఫ్రెంచ్ ఓపెన్ టైటిళ్లతో ర్యాంకు మెరుగవ్వొచ్చు అని పేర్కొన్నాడు. వరస విజయాలతో దూసుకెళుతున్న శ్రీకాంత్ను.. ప్రకాశ్ పదుకొనె, గోపీచంద్ లాంటి దిగ్గజాల సరసన చేరానని భావిస్తున్నారా? అని మీడియా ప్రశ్నించింది. దీనికి అతడు బదులిస్తూ వారి సరసన నిలబడే స్థాయి నాకింకా రాలేదు. ఇంకా మెరుగ్గా ఆడాలి. సూపర్ సిరీస్‌ల కంటే పెద్ద విజయాలు కావాలి. ఒలింపిక్స్, ప్రపంచ ఛాంపియన్‌షిప్ లాంటి టోర్నీల్లో పతకాలు సాధించినప్పుడు వారి స్థాయికి చేరుకుంటానేమో అని పేర్కొన్నాడు. భారత పురుషుల సింగిల్స్ ఇప్పుడు మంచి స్థితిలో ఉందని శ్రీకాంత్ తెలిపాడు.

నేను 4 టైటిళ్లు సాధించా. సాయిప్రణీత్ ఒక టై%టిల్ గెలిచాడు. ప్రణయ్ అద్భుతంగా ఆడుతున్నాడు.. అతడు డెన్మార్క్ ఓపెన్‌లో లీ చాంగ్ వీని ఓడించాడు. ఫ్రెంచ్ ఓపెన్ సెమీస్‌లో నాకు గట్టి పోటీ ఇచ్చాడు. అందరూ బాగా ఆడుతున్నారు అని అతడు చెప్పుకొచ్చాడు.

# సీఎం కార్యాలయానికి కాషాయం రంగు



లఖ్‌నవూ: ఉత్తర్‌ప్రదేశ్‌లో భాజపా అధికారంలోకి వచ్చిన నాటి నుంచి అక్కడ అన్నీ కాషాయమయం అవుతున్నాయి. మొన్నటికి మొన్న రాష్ట్ర ప్రభుత్వానికి చెందిన కొన్ని బస్సులను కాషాయం రంగులోకి మార్చగా.. తాజాగా సీఎం అధికారిక కార్యాలయానికి కూడా ఆ రంగే వేస్తున్నారు.

యూపీ రాజధాని లఖ్‌నవూలోని లాల్‌బహదూర్ శాస్త్రీ భవన్‌లో సీఎం అధికారిక కార్యాలయంతో పాటు పలు సీనియర్ అధికారుల ఆఫీసులు కూడా ఉన్నాయి. ఇప్పటి వరకు ఈ భవనం యూపీ సంప్రదాయ తెలుపు, నీలం రంగుల్లో ఉంది. అయితే తాజాగా దీనికి కాషాయ రంగు వేస్తున్నారు. దీంతో ప్రతిపక్షాల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అధికార భవనాలను సైతం ప్రభుత్వం కాషాయ మయం చేస్తోందని ఆరోపిస్తున్నాయి.

యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ కూడా ఎప్పుడూ కాషాయ రంగు దుస్తుల్లోనే కనబడుతున్న విషయం తెలిసిందే. ఆయన ఆఫీసులో వినియోగించే టవల్స్ దగ్గర్నుంచి.. కర్టెన్ల వరకు అన్నీ ఇదే రంగులో ఉంటాయట. ఇటీవల 50 ప్రభుత్వ రవాణా బస్సులను కూడా కాషాయంలోకి మార్చారు.

# ఆ బ్రిడ్జీ కట్టేందుకు ఆర్మీ అవసరమా..!

న్యూఢిల్లీ: ముంబైలోని ఎల్ఫినోస్టోన్ రైల్వేస్టేషన్‌లో బ్రిడ్జి నిర్మాణానికి ఆర్మీని రంగంలోకి దింపినట్టు మహారాష్ట్ర ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవిస్ మంగళవారం ప్రకటించారు. ఎల్ఫిన్‌స్టోన్ రైల్వేస్టేషన్‌లో ఫుట్ ఓవర్ బ్రిడ్జీపై తొక్కిసలాట జరిగి.. 23మంది చనిపోయిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ఈ స్టేషన్‌తోపాటు మరో రెండు రైల్వే స్టేషన్లలో ఫుట్ ఓవర్ బ్రిడ్జీలను కట్టేందుకు ఆర్మీ సహకారం తీసుకుంటున్నట్టు సీఎం ఫడ్నవిస్ తెలిపారు. వచ్చే జనవరి 31నాటికి వీటి నిర్మాణం పూర్తవుతుందని ఆయన ప్రకటించారు.

తొక్కిసలాట జరిగిన ఎల్ఫిన్‌స్టోన్ రైల్వేస్టేషన్‌ను సందర్శించేందుకు కేంద్ర రక్షణమంత్రి నిర్మలా సీతారామన్, రైల్వేమంత్రి పీయూష్ గోయల్ ముంబైకి వచ్చిన సందర్భంగా ఫడ్నవిస్ ఈ ప్రకటన చేశారు.

అయితే, సీఎం ఫడ్నవిస్ ప్రకటనపై తీవ్ర విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆర్మీ మాజీ జవాన్ అయిన పంజాబ్ సీఎం అమరిందర్‌సింగ్ ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించారు. ఆర్మీ, నిర్మలా సీతారామన్‌లను ట్విట్టర్‌లో ట్యాగ్ చేస్తూ.. సివిల్ పనుల కోసం ఆర్మీ వనరులను వాడుకోవడం ఎంతమాత్రం సరికాదని నిర్మలను తప్పుబట్టారు. 'ఆర్మీ కర్తవ్యం యుద్ధం కోసం శిక్షణ పొందడం కానీ, సివిల్ పనుల కోసం ఉపయోగించుకోవడం కాదు నిర్మలాజీ. రక్షణ వనరులను పౌర పనుల కోసం వినియోగించరాదు. 1962 చైనా యుద్ధం సమయంలోనూ జనరల్ కౌల్ ఇదే విధంగా వ్యవహరించారు.

ఇలా చేయడం సరైన సంప్రదాయం కాదు.

దీనిని నివారించండి ప్లీజ్' అంటూ ఆయన కామెంట్ చేశారు. జమ్మూకశ్మీర్ మాజీ సీఎం ఒమర్ అబ్దుల్లా, కాంగ్రెస్ నేత సంజయ్ నిరుపమ్ సైతం ఈ విధానాన్ని ట్విట్టర్‌లో తప్పుబట్టారు. అత్యవసర పరిస్థితుల్లో ఆర్మీని వాడుకోవడం చూశాం కానీ, ఇప్పుడు రోడ్ల మీద గుంతలు పడినా..ఆర్మీని పిలిచేలా కనిపిస్తోందని మండిపడ్డారు.

# కోహ్లీకి స్నేహితురాలు ఉంటే సమస్యేంటి..

**- ఆశిష్ నెహ్రా**



దిల్లీ: భారత బౌలర్ ఆశిష్ నెహ్రా అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై పలికేందుకు సిద్ధమయ్యాడు. భారత్-న్యూజిలాండ్ మధ్య బుధవారం దిల్లీలోని ఫిరోజ్‌షా కోట్ల మైదానంలో టీ20 జరగనుంది. ఈ మ్యాచ్ ద్వారా నెహ్రా తన అంతర్జాతీయ క్రికెట్‌కు గుడ్ బై పలకనున్నాడు. సొంతగడ్డపై అభిమానుల మధ్య వీడ్కోలు పలకాలని ఉందని గతంలో బీసీసీఐకి తెలిపాడు.

తాజాగా నెహ్రా ఓ కార్యక్రమంలో పాల్గొన్నాడు. ఈ క్రమంలో అతనికి ప్రేమపక్షులు కోహ్లీ-అనుష్క గురించి ప్రశ్నించగా.. వీరిద్దరి విషయంలో మీడియానే ఎక్కువ చేస్తోందని నా అభిప్రాయం. క్రికెటర్లు ఏడాదిలో ఎక్కువ సమయాన్ని కుటుం బసభ్యులతో గడపలేరు. ఒకవేళ విరాట్ కోహ్లీకి హై ప్రొఫైల్ గర్ల్‌ఫ్రెండ్ ఉంటే సమస్య ఏమిటో నాకు అర్థం కాదు. ఇక్కడ సమస్య అంతా ప్రజల నుంచే. వారిద్దరి గురించి ఏవేవో వార్తలు పుట్టిస్తారు.

ఇష్టమొచ్చినట్లు మాట్లాడుకుంటారు. అని నెహ్రా అన్నాడు. అనంతరం తన ఆట గురించి మాట్లాడుతూ.. అందరూ నేర్చుకుని ఆ తర్వాత ఆడతారు.. నేను మాత్రం ఆడుతూ నేర్చుకుంటా. అని తెలిపాడు.

ఆస్ట్రేలియాతో టీ20 సిరీస్‌కు ఎంపికైన నెహ్రా తుది జట్టులో మాత్రం చోటు దక్కించుకోలేకపోయాడు. దీంతో బుధవారం కివీస్‌తో తలపడే భారత తుది జట్టులో నెహ్రా స్థానం దక్కించుకుంటాడో లేదో చూడాలి.

# సంక్షేమ పథకాల యూనిట్లు శతశాతం గ్రౌండ్ కావాలి



విశాఖపట్నం : బడుగు, బలహీన, అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమానికై ప్రభుత్వం మంజూరుచేస్తున్న పలు యూనిట్లు క్షేత్ర స్థాయిలో శతశాతం గ్రౌండ్ అయ్యేలా అధికారులు పర్యవేక్షించాలని రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు ఆదేశించారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో జిల్లా అదనపు సంయుక్త కలెక్టర్ ఎ.శిరి, జిల్లా అల్పసంఖ్యాక వర్గాల సంక్షేమ అధికారి భవాని, ఎస్‌సి కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ మహాలక్ష్మి తదితరులతో మంత్రి సమావేశమై పథకాల అమలుతీరును సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ లబ్ధిదారులకు పలు యూనిట్లు మంజూరు చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో గ్రౌండ్ కావడంలేదని అవేదన వ్యక్తంచేశారు. దీని బాధ్యత అధికారులు వహించాలని బ్యాంకర్ల వల్ల ఏమైనా సమస్యలు ఉంటే చర్చించి పరిష్కరించుకోవలన్నారు.

**మైనారిటీల పథకాలపై అవగాహన కల్పించాలి**

అల్ప సంఖ్యాక వర్గాల సంక్షేమానికి ప్రభుత్వం పలు పథకాలు అమలుచేస్తున్నప్పటికీ లబ్ధిదారులకు సరైన అవగాహన లేకపోవడం వల్ల సద్వినియోగం కావడంలేదని మంత్రి ఆవేదన వ్యక్తంచేశారు.

# రోహిత్ శర్మ సరికొత్త రికార్డు



కాన్పూర్: భారత క్రికెట్ జట్టు వన్డే వైస్ కెప్టెన్ రోహిత్ శర్మ సరికొత్త రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. వన్డే ఫార్మాట్ లో 150 సిక్సర్లను అత్యంత తక్కువ ఇన్నింగ్స్ ల్లో సాధించిన తొలి భారత క్రికెటర్ గా రోహిత్ రికార్డు నెలకొల్పాడు. 171 మ్యాచ్ ల్లో 165 ఇన్నింగ్స్ ల్లో రోహిత్ 150వ వన్డే సిక్సర్ ను సాధించాడు. ఇది భారత తరపున వేగవంతమైన మైలురాయి. న్యూజిలాండ్ తో ఇక్కడ ఆదివారం జరిగిన మూడో వన్డేలో రోహిత్ ఈ ఘనత సాధించాడు. ఆ మ్యాచ్ లో రెండు సిక్సర్లు సాధించిన రోహిత్ శర్మ.. 150 సిక్సర్ల క్లబ్ లో చేరిపోయాడు. ఓవరాల్ గా చూస్తే ఈ ఫీట్ ను తక్కువ ఇన్నింగ్స్ ల్లో సాధించిన రెండో క్రికెటర్ రోహిత్ శర్మ. ఇక్కడ పాకిస్తాన్ మాజీ క్రికెటర్ షాహిద్ ఆఫ్రిది తొలి స్థానంలో ఉన్నాడు. 160 ఇన్నింగ్స్ ల్లోనే 150 సిక్సర్ల మార్కును చేరి అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఇక192 ఇన్నింగ్స్ ల్లో 150 సిక్సర్ల మార్కును చేరిన మహేంద్ర సింగ్ ధోని భారత తరపున రెండో స్థానంలో ఉన్నాడు.ఓవరాల్ గా ఈ ఫీట్ ను తక్కువ ఇన్నింగ్స్ ల్లో సాధించిన ఐదో క్రికెటర్ ధోని. ఇక్కడ ఏబీ డివిలియర్స్ మూడో స్థానంలో, క్రిస్ కెయిన్స్ నాల్గో స్థానంలో ఉన్నారు. వీరిలో ప్రస్తుతం క్రికెట్ ఆడుతున్న ధోని, ఏబీ డివిలియర్స్ లు రెండొందల వన్డే సిక్సర్లను దాటిన ఆటగాళ్లు.

# కోహ్లీ వల్ల నా ఉద్యోగానికి ఎసరు..!



దిల్లీ: ప్రస్తుతం భారత క్రికెట్ జట్టుకు ఒంటిచేత్తో విజయాలు అందిస్తోన్న విరాట్ కోహ్లీని జట్టులోకి ఎంపిక చేసినందుకు తనను ఉద్యోగంలో నుంచి తొలగించారని మాజీ క్రికెటర్, మాజీ సెలక్టర్ దిలీప్ వెంగ్‌సర్కార్ తెలిపారు. ప్రముఖ పాత్రికేయుడు రాజ్‌దీప్ సర్దేశాయ్ రాసిన డెమోక్రసీ ఎలెవన్ పుస్తకావిష్కరణ కార్యక్రమానికి ఎందరో మాజీ క్రికెటర్లు హాజరైన సంగతి తెలిసిందే. ఈ కార్యక్రమంలో పాల్గొన్న దిలీప్.. బీసీసీఐ చీఫ్ సెలక్టర్ ఉద్యోగం ఎలా పోయిందో వివరించాడు.

# డీలర్లపై నమోదైన కేసులు వారంరోజుల్లో అమలుపర్చాలి

## జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ జి.సృజన




విశాఖపట్నం: ప్రజా పంపిణీ వ్యవస్థ డీలర్లు, ఇతర వర్తకులపై నమోదై పరిష్కరించబడిన 117 కేసులను వారం రోజుల్లో అమలుపర్చాలని జిల్లా ఇన్‌ఛార్జి కలెక్టర్ జి.సృజన పౌర సరఫరాల అధికారులను ఆదేశించారు. మంగళవారం ఆమె అధ్యక్షతన జిల్లా స్థాయి ఆహార సలహా సంఘం సమావేశం కలెక్టరేట్‌లో జరిగింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఏడాది కాలంలో ప్రజా పంపిణీ వ్యవస్థ డీలర్లు, ఇతర వర్తకులపై నమోదైన 6-ఏ కేసులలో 117 కేసులను విచారించి జరిమానాలను విధించడం జరిగిందని, అందులో ప్రజాపంపిణీ డీలర్లపై 67 కేసులు, ఎరువుల షాపులు, ఇతర వర్తకులపై 50 కేసులు నమోదైన వాటిని పరిష్కరించడం జరిగిందన్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలకు సంబంధించి వారానికి 20 కేసుల చొప్పున మొత్తం 117 కేసులను పరిష్కరించడం జరిగిందన్నారు. దీపం గ్యాస్ కనెక్షన్లు అందరికీ పంపిణీ చేయడం వల్ల జిల్లాలో కిరోసిన్ సరఫరాను నిలుపుదల చేశామన్నారు. ప్రత్యేకించి పాడేరు డివిజన్‌లో పూరిగుడిసెల్లో నివసిస్తున్న 16వేల కుటుంబాలకు, పలు స్కీముల క్రింద నిర్మాణంలోనున్న 32వేల గృహ నిర్మాణం లబ్ధిదారులకు వెరసి మొత్తం 48వేల కుటుంబాలకు కిరోసిన్ పంపిణీ చేసేందుకు ప్రభుత్వ అనుమతిని కోరుతూ ప్రతిపాదనలు సమర్పించామన్నారు. డీలర్లు సస్పెండ్ అయిన రేషన్ షాపుల నిర్వహణ బాధ్యతలను స్థానిక డ్వాక్రా సంఘాల ప్రతినిధులకు అప్పగిస్తున్నట్లు ఆమె తెలిపారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా చేసే నిత్యావసర సరుకులపై నిఘా వుంచేందుకు వివిధ స్థాయిలో విజిలెన్సు కమిటీలను ఏర్పాటు చేయాలని ఆదేశిస్తూ ప్రభుత్వం జిఓఎంఎస్‌నెం.16ను జారీ చేసిందన్నారు.

ఈ మధ్యకాలంలో మరణించిన నర్సీపట్నం వినియోగదారుల సమాచార కేంద్రం అధ్యక్షులు పి.శ్రీనివాస్ మృతికి సంతాపం తెలుపుతూ ఆహార సలహా సంఘాల సభ్యులు కొంతసేపు మౌనం పాటించారు. ఈ సమావేశంలో విశాఖపట్నం రెవెన్యూ డివిజనల్ అధికారి వెంకటేశ్వర్లు, జిల్లా పౌర సరఫరాల అధికారులు సువార్తవాణి, నిర్మలాభాయి, జిల్లా వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షులు కాండ్రేగుల వెంకటరమణ తదితరులతో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

# ఆధార్ తప్పనిసరి దేశ భద్రతకు ముప్పు

దిల్లీ: పలు సంక్షేమ పథకాలకు ఆధార్‌ను తప్పనిసరి చేస్తూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని పలువురు వ్యతిరేకిస్తున్న విషయం తెలిసిందే. దీనిపై భాజపా ఫైర్ బ్రాండ్, రాజ్యసభ ఎంపీ సుబ్రహ్మణ్య స్వామి మంగళవారం ట్విటర్ ద్వారా స్పందించారు. ఆధార్‌ను తప్పనిసరి చేయడం వల్ల దేశ భద్రతకే ముప్పు వాటిల్లే అవకాశం ఉంది. ఈ విషయాన్ని రాజ్యాంగ ధర్మాసనం పరిగణలోకి తీసుకుంటుందని ఆశిస్తున్నాను. దీనిపై సవివరంగా ప్రధాని నరేంద్రమోదీకి త్వరలోనే లేఖ రాస్తాను. అని స్వామి ట్విటర్‌లో పేర్కొన్నారు.

ఆధార్ తప్పనిసరి అంశాన్ని చీఫ్ జస్టిస్ దీపక్ మిశ్రాతో కూడిన ధర్మాసనం విచారించిన విషయం తెలిసిందే. ఆధార్ తప్పనిసరిని వ్యతిరేకిస్తూ దాఖలైన పటిషన్లపై వాదనలు ఆలకించడానికి విస్తృత రాజ్యాంగ ధర్మాసనాన్ని ఏర్పాటు చేయాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసిన విషయం తెలిసిందే. నవంబరు నెలాఖరు నుంచి విచారణ ప్రారంభం కానుంది.








VIJAYABHANU - Visakhapatnam

Editor : B. Chandra Sekhar, Printed and Published by him on behalf of **VIJAYABHANU PUBLICATIONS PVT. LTD.,** Published and Printed at **VIJAYABHANU PRESS,** D.No. 9-3-17, Pithapuram Colony, Visakhapatnam - 530 003.
R.N.I. No. 32157/77. Postal Regd. No. J/VM-RNP/32 ☆ Phone : 2564353, Fax : 0891-2569004 ☆ e-mail: vijayabhanudaily@gmail.com